### విలేఖరులు కావలెను

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారధ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com



ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

TELTEL/2012/47103

తెలుగు జాతీయ దిన పత్రిక

సంపుటి : 12 సంచిక :83 నల్గొండ ఆదివారం 15-06-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్ పేజీలు : 4 వెల : రూ.1/-


## నియోజకవర్గంలో ఇసుక దందా బంద్...



చెన్నూర్, మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గంలో అక్రమంగా కొనసాగుతున్న ఇసుక దందాలను వెంటనే నిలిపి వేయాలని కార్మిక, ఉపాధి, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి హుకుం జారీ చేశారు. చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి మంత్రిగా పదవీ బాధ్యతలు తీసుకున్న తర్వాత మొదటిసారిగా శనివారం మధ్యాహ్నం నియోజకవర్గంలోని ఇందారం చేరుకున్నారు.మంత్రికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఇందారం, రసూలపల్లి, జైపూర్, భీమారంలో కార్నర్ మీటింగ్ లో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తనపై నమ్మకంతో మైనింగ్, కార్మిక మంత్రి పదవులను అప్పగించిందని, ఆ శాఖలకు న్యాయం చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. తన ఇలాఖలో ఎలాంటి అక్రమ దందాలు సాగనివ్వనని ఇది తన హెచ్చరిక అని అన్నారు. ఎలాంటి అక్రమాలు జరిగినా పోలీసులు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిజాయితీగా పని చేస్తూ ప్రజలకు సేవకులుగా ఉందామని నాయకులకు పిలుపునిచ్చారు. తొలిసారి నియోజకవర్గానికి వచ్చిన మంత్రికి నాయకులు కార్యకర్తలు, ఘనంగా స్వాగతిస్తూ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

## కాళేశ్వరం ఓ పనికిరాని ప్రాజెక్ట్

హన్మకొండ,జూన్14: ప్రజాధనాన్ని ఇకపై కాళేశ్వరం కోసం ఖర్చు చేయొద్దని సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఈ మేరకు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనికిరాదని, దాన్ని పూర్తిగా రద్దు చేయాలని అన్నారు. కూనంనేని మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరానికి అన్నీ తానే అన్న మాజీ సీఎం కెసిఆర్ ఇప్పుడు సంబంధం లేదంటున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం నిర్మించాక ఒక్క ఎకరాకు అదనంగా నీళ్లు ఇవ్వలేదని, ఎల్లంపల్లి ద్వారానే పంటలకు నీళ్లు అందుతున్నాయని తెలియజేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పనికిరాదని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల సొమ్మును ఇకపై కాళేశ్వరం కోసం ఖర్చు చేయొద్దని సూచించారు. కేసీఆర్ అంటే కాళేశ్వరం.. కాళేశ్వరం అంటే కేసీఆర్ అన్నోళ్లు ఇప్పుడు నోరు మూసుకున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో అన్నీ తానే అన్న కేసీఆర్ ఇప్పుడు తనకు సంబంధం లేదని ఎందుకు అంటున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. మహారాష్ట్ర పర్మిషన్ ఇవ్వలేదని మాజీ మంత్రి హరీష్‌రావు అంటున్నారని చెప్పారు. గతంలో 140మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్ట్ కట్టాలని తాము డిమాండ్ చేశామని గుర్తుచేశారు. కాళేశ్వరం నిర్మించాక ఒక చుక్కనీరు అదనంగా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. పంటలకు వచ్చేవి ఎల్లంపల్లి నీళ్లేనని స్పష్టం చేశారు కూనంనేని సాంబశివరావు. కేంద్రప్రభుత్వం మానవ హక్కులను ఉల్లంఘిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టుల మృతదేహాలను చూసి కూడా కేంద్రం భయపడుతోందని, మృతదేహాన్ని అప్పగించకపోవడం దారుణమని కూనంనేని



సాంబశివరావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితఎపిసోడ్ ఇప్పుడు రాజకీయాల్లో ఒక కొత్త చర్చకు దారితీసింది. తాజాగాకూనంనేని సాంబశివరావు షాకింగ్ కామెంట్స్ చేశారు. కవిత ప్రకటనతో బీఆర్ఎస్, బీజేపీ పార్టీల మధ్య ఉన్న రహస్య ఒప్పందం బయటపడిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ షర్మిల స్థితిగతులు ఎలా ఉన్నాయో.. తెలంగాణలో కవిత పరిస్థితి కూడా అలాగే ఉందని ఆయన విమర్శించారు. పేదలు లేని దేశంగా ఇండియాని చూపాలని మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. నెలకు రూ.8 వేల ఆదాయం ఉంటే ధనికులు ఎలా అవుతారని ప్రశ్నించారు. పేదలను మోదీ ప్రభుత్వం దగా చేస్తోందని ఫైర్ అయ్యారు. నెలకు రూ. 20వేల ఆదాయం ఉన్నా కూడా పేదవారిగానే పరిగణించాలని కూనంనేని సాంబశివరావు కోరారు.

## పశ్చిమాసియాలో భీకర యుద్ధం...

టెహ్రాన్:పశ్చిమాసియాలో ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య భీకర యుద్ధం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఇరు దేశాలు మిసైళ్లు, డ్రోన్లతో దాడులు చేసుకుంటున్నాయి. జనాలపై బాంబులు కురుస్తున్నాయని, జెరూసలేం వంటి పవిత్ర నగరాలు కూడా దాడులకు గురవుతున్నాయని తెలుస్తోంది.

-ఇజ్రాయెల్ 'ఆపరేషన్ రైజింగ్ లయన్' దాడులు:

గురువారం అర్ధరాత్రి, శుక్రవారం తెల్లవారుజామున ఇజ్రాయెల్ "ఆపరేషన్ రైజింగ్ లయన్" పేరుతో ఇరాన్‌పై పెద్దఎత్తున వైమానిక దాడులకు పాల్పడింది. ఇరాన్‌లోని అణ్వాయుధ కేంద్రాలు, మిలిటరీ స్థావరాలు, సైనిక ఉన్నతాధికారులే లక్ష్యంగా వందల క్షిపణులు, డ్రోన్లతో ఇజ్రాయెల్ విరుచుకుపడింది. ఈ దాడుల్లో ఇరాన్ సైనిక దళాల పర్యవేక్షకుడు జనరల్ మహమ్మద్ బాఘేరి, రెవల్యూషనరీ గార్డ్ చీఫ్ మేనేజర్ జనరల్ హొస్సేన్ సలామీసహా పలువురు కీలక సైన్యాధికారులు, అణు శాస్త్రవేత్తలు మృతిచెందారు. ఈ దాడుల్లో మొత్తం 78 మంది పౌరులు మరణించగా, 329 మంది గాయపడినట్లు సమాచారం.

-ఇరాన్ ప్రతీకార దాడులు:

ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా ఇరాన్ సైతం శనివారం తెల్లవారుజామున క్షిపణులతో దాడులు చేసింది. ఇరాన్ క్షిపణులు, రాకెట్లు ఇజ్రాయెల్ లోని టెల్ అవీవ్ ను తాకాయి. ఇజ్రాయెల్‌లోని రెండు అతిపెద్ద నగరాలైన జెరూసలేంపై కూడా మిసైల్ దాడులు జరిగాయి. ఇరాన్ ప్రయోగించిన క్షిపణుల దాడిని చురుగ్గా అడ్డుకుంటున్నామని ఇజ్రాయెల్ దళాలు తెలిపాయి. అనేక నగరాల్లో వైమానిక దాడుల సైరన్లు మోగాయి. టెల్ అవీవ్‌లో ఇరాన్ దాడుల కారణంగా దాదాపు 35 మంది గాయపడినట్లు సమాచారం. జెరూసలేంలో కూడా భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి.

-టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ మరోసారి దాడి:

శనివారం తెల్లవారుజామున ఇజ్రాయెల్ టెహ్రాన్‌పై మరోసారి మిసైళ్ల దాడికి పాల్పడింది. స్థానిక మీడియా నివేదికల ప్రకారం, రెండు క్షిపణులు మెహ్రాబాద్



విమానాశ్రయాన్ని తాకాయి. ఈ ప్రాంతంలోనే ఫైటర్ జెట్‌లు, రవాణా విమానాలను కలిగి ఉన్న వైమానిక దళ స్థావరం కూడా ఉంది. ఈ ప్రదేశంలో మంటలు చెలరేగినట్లు తెలిసింది. ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ నివాస సమీపంలోనూ ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరిగినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. టెహ్రాన్‌లోని మోనిరియాలో ఈ వైమానిక దాడులు జరిగాయి. అక్కడే ఖమేనీ నివాసంతోపాటు ఇరాన్ అధ్యక్ష కార్యాలయం కూడా ఉంది.

-ఇరాన్ మిలిటరీ చీఫ్‌గా అమీర్ హతామీ

ఇజ్రాయెల్ క్షిపణుల దాడిలో ఇరాన్ మిలిటరీ చీఫ్ మహమ్మద్ బాఘేరి మృతిచెందాడు. యుద్ధం మొదలైన నేపథ్యంలో ఆఘమేఘాలపై అతని స్థానంలో ఇరాన్ కొత్త మిలిటరీ చీఫ్ గా అమీర్ హతామీని నియమించినట్లు ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ తెలిపారు. ఇది యుద్ధ వాతావరణంలో ఇరాన్ తీసుకున్న కీలక నిర్ణయం. ఈ పరిణామాలు పశ్చిమాసియాలో మరింత తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి. ప్రపంచ దేశాలు ఈ యుద్ధం మరింత పెద్దది కాకుండా ఆపేందుకు ప్రయత్నించాలని కోరుతున్నాయి.

## లక్కీ నంబరే కొంపముంచిందా?



అహ్మదాబాద్,జూన్14, అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదంలో మరణించిన గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపాణీ ప్రయాణానికి సంబంధించి మరో విషయం వెలుగులోకి వచ్చింది. లండన్‌లో ఉన్న తన భార్య, కుమార్తెను కలిసేందుకు వెళ్తున్న రూపాణీ.. అంతకుముందు రెండుసార్లు వెళ్లేందుకు సిద్ధమై టికెట్ రద్దు చేసుకున్నట్లు తెలిసింది. చివరకు మూడోసారి బయలుదేరినప్పటికీ గమ్యాన్ని చేరకముందే విమాన ప్రమాదంలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. అంతేకాదు ఆయన లక్కీ నంబర్‌గా భావించే '1206' సంఖ్య కలిగిన తేదీనే ఆయనకు చివరి ప్రయాణం అయ్యింది. రూపాణీ వ్యక్తిగత వాహనాలన్నీ అదే నంబరుతో ఉన్నట్లు సమాచారం. అయితే ఆ లక్కీ నెంబరే గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ ప్రాణం తీసిందనే ఓ చర్చ అయితే ప్రస్తుతం వైరల్ అవుతోంది. విజయ్ రూపానీ లక్కీ నెంబర్ 1206. ఆయన ముఖ్యమంత్రిగా ఉండగా.. ఈ నెంబరే తన అధికారిక వాహనానికి పెట్టుకున్నారు. అలాగే ఆయన సొంత వాహనాలు.. కారు, స్కూటర్‌లకు సైతం ఇదే నెంబర్ వచ్చేలా ఆయన చూసుకున్నారు. అయితే ఆయన.. తన లండన్ ప్రయాణాన్ని సైతం లక్కీ నెంబర్ వచ్చేలా చూసుకున్నారు. కానీ తాను ఒకటి తలిస్తే దైవం ఒకటి తలిచినట్లుగా.. ఆ రోజు ప్రయాణమే ఆయనకు చివరి ప్రయాణం కావడం గమనార్హం. ఈ లక్కీ నెంబర్ రోజు తన ప్రయాణాన్ని ఆయన వరుసగా రెండు సార్లు టికెట్ బుక్ చేసుకుని మరీ రద్దు చేసుకున్నారు. మాజీ సీఎం విజయ్ రూపానీ కుమార్తె లండన్‌లో ఉన్నత విద్యను అభ్యసిస్తోంది. ఈ నేపథ్యంలో విజయ్ రూపానీ భార్య ఇప్పటికే లండన్‌లో కుమార్తె వద్ద ఉన్నారు. దీంతో కుమార్తె వద్ద కొన్ని రోజులు ఉండి.. తిరుగు ప్రయాణంలో భార్యను తన తీసుకు రావాలని మాజీ సీఎం విజయ్ రూపానీ భావించారు. అందులో భాగంగా తొలుత లండన్ వెళ్లేందుకు మే 19వ తేదీన ఆయన విమాన టికెట్ బుక్ చేసుకున్నారు. ఆ తర్వాత దీనిని రద్దు చేసుకున్నారు.అనంతరం జూన్ 5వ తేదీన లండన్ వెళ్లాలని ఆయన భావించారు. కానీ ఆ టికెట్‌ను సైతం ఆయన రద్దు చేసుకున్నారు. చివరగా తన లక్కీ నెంబర్ కలిసేలా జూన్ 12వ తేదీన ఆయన లండన్ వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దీంతో ఎయిర్ ఇండియా విమానంలో 12డీ నెంబర్ సీటును ఆయన ప్రత్యేకంగా బుక్ చేసుకున్నారు. ఆ క్రమంలో ఈ ప్రయాణంలో తన లక్కీ నెంబర్‌గా భావించిన రోజే ఆయన మరణించారు.జూన్ 12వ తేదీ 1.38 గంటలకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం కొన్ని నిమిషాలకే కుప్ప కూలి మంటల్లో దగ్ధమైంది. అందులో రూపానీ కూడా ఉన్నారు.

## సత్య హరిశ్చంద్రుడు కేటీఆర్!



హైదరాబాద్,కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇచ్చింది. జూన్ 16న విచారణకు పిలిచింది. తాను ఎంక్వైరీకి వస్తానని.. అధికారులకు సహకరిస్తానని కేటీఆర్ చెప్పారు. అక్కడితో ఆగిపోలేదు. సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ సైతం విసిరారు. దమ్ముంటే మన ఇద్దరిపై ఉన్న ఏసీబీ కేసులపై.. లై డిటెక్టర్ టెస్ట్‌కు సిద్ధమా అంటూ ఛాలెంట్ చేశారు. కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇచ్చినందునే ఇంతలా ఉలిక్కిపడుతున్నారంటూ కాంగ్రెస్ నేతలు వరుసగా కౌంటర్లు ఇస్తున్నారు.

కేటీఆర్ బడాయి కబుర్లు!

ఛాలెంజ్‌లు విసిరి పారిపోయిన చరిత్ర కేటీఆర్‌దే అన్నారు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్. గతంలో డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో వైట్ ఛాలెంజ్‌కు రావాలని రేవంత్ రెడ్డి పిలిస్తే.. రాకుండా పారిపోయిన చరిత్ర కేటీఆర్‌దని గుర్తు చేశారు. ఫార్ములా-ఈ రేస్ కేసులో ఏసీబీ నోటీసులు ఇవ్వగానే హడలిపోతున్నారంటూ సెటైర్లు వేశారు. విచారణకు వెళ్తానని చెబుతూనే బడాయి కబుర్లు చెబుతున్నారంటూ మండిపడ్డారు. కేటీఆర్ సత్యహరిశ్చంద్రుడి మాదిరిలా మాట్లాడుతున్నారంటూ ఎద్దేవా చేశారు ఆది శ్రీనివాస్.

నార్కో.. నాకా నీకా?

సీఎం రేవంత్ రెడ్డికి నార్కో ఎనాలసిస్ టెస్ట్ చేయాలా.. లేదంటే పాలిగ్రాఫ్ టెస్టులు చేయాలా అన్నది కోర్టులు, విచారణ సంస్థలు నిర్ణయిస్తాయన్నారు. కేటీఆర్ మాత్రం ఏసీబీ విచారణకు హాజరై వాళ్లు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెపితే సరిపోతుందన్నారు. కల్వకుంట్ల కుటుంబానికి ధైర్యం ఉంటే కేసీఆర్, కవిత, హరీష్‌రావు నార్కో టెస్టులు చేయించుకోవాలని సవాల్ విసిరారు శ్రీనివాస్. "కాళేశ్వరంలో మీ కక్కుర్తి పైన మీ అయ్యకు, మీ బావకు నార్కో ఎనాలసిస్ టెస్ట్ చేయిందాం.. లిక్కర్ స్కాంలో మీ చెల్లెలుకి నార్కో చేయిద్దాం.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నీకు కూడా టెస్ట్ చేయాలి" అంటూ ప్రభుత్వ విప్ ఆది ఓ రేంజ్‌లో ఫైర్ అయ్యారు. కేటీఆర్‌కు జైలుకు వెళ్లాలన్న ఉబలాటం అంతగా ఉంటే ఆ కోరికను దర్యాప్తు సంస్థలు తీర్చుతాయని.. తొందర పడకండంటూ సెటైర్లు వేశారు.

ఇంగ్లీష్ ఫుల్.. సబ్జెక్ట్ నిల్..

కేటీఆర్‌కు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సైతం స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ట్విటర్ టిల్లు కేటీఆర్‌కు ఇంగ్లీష్ ఫుల్, సబ్జెక్ట్ నిల్ అన్నారు. ఫార్ములా ఈ కార్ రేసులో నోటీసులు ఇవ్వడంతో ఆ ఫ్రస్టేషన్‌తో లై డిటెక్టర్ టెస్ట్ చేయించుకుందామని సీఎం రేవంత్ రెడ్డికి ఛాలెంజ్ చేస్తున్నారని చెప్పారు. ఆ నాడు డ్రగ్స్ కేసులో వైట్ ఛాలెంజ్ నుంచి ఎందుకు పారిపోయారని ప్రశ్నించారు. కేబినెట్ అనుమతి లేకుండా 44కోట్లు ఎలా తరలించారని ఏసీబీ ప్రశ్నించడం, ఏజెన్సీలు విచారణ చేయడం తప్పా అని ప్రశ్నించారు. మొన్న కేసీఆర్ చుట్టూ దయ్యాలు తిరుగుతున్నాయన్న కవిత.. ఇవాళ మా వర్కింగ్ ప్రెసిడెంట్‌కు నోటీసులు ఇస్తారని అనడం విడ్డూరంగా ఉందన్నారు. వీళ్ల ఫ్యామిలీ డ్రామాని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు చామల.

కేటీఆర్ ఫ్రస్టేషన్ అందుకేనా?

ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ కూడా కేటీఆర్‌పై విరుచుకుపడ్డారు. విచారణకు హాజరై సమాధానం చెప్పమంటే.. పక్కవారి కేసులను లింకు పెడుతూ పక్క చూపులు ఎందుకు చూస్తున్నారంటూ నిలదీశారు. లై డిటెక్టర్ పేరుతో అసలు విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని తప్పుబట్టారు. ముందు చెల్లె చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని.. ఇంటి లొల్లితో ఫ్రస్టేషన్‌లో కేటీఆర్ ఏదేదో మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

కేటీఆర్‌పై పోలీస్ కేసు

మరోవైపు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ చేసిన ఫిర్యాదుపై యాక్షన్ తీసుకున్నారు. కేటీఆర్ వ్యాఖ్యలు అవమానకరంగా, సీఎం ప్రతిష్టను దెబ్బతీసే విధంగా ఉన్నాయని వెంకట్ ఇచ్చిన కంప్లైంట్‌పై కేసు ఫైల్ అయింది.

## రాజీపడితే ఇరువర్గాలు గెలిచినట్టే...

ఇల్లెందు, జూన్ 14 : కక్షిదారులు క్షణికావేశంలో పెట్టుకున్న పోలీస్ కేసులు రాజీపడదగిన, మనోవర్తి , గృహ హింస, చెక్ బౌన్స్, ప్రామిసరీ నోటు కేసుల్లో ఇరువర్గాలు కోర్టుకు వచ్చి రాజీ కుదుర్చుకున్నట్లైతే ఇరు వర్గాలు గెలిచినట్లే అవుతుందని ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తిచంద్రిక రెడ్డి అన్నారు. శనివారం ఉదయం స్థానిక ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఇల్లందు మండల న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజీపడదగిన కేసుల్లో కక్షిదారులు రాజీపడితే ఎంతో విలువైన కాలాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చన్నారు. కక్షిదారులు పంతాలకు పోకుండా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం ఇల్లందు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జడ్జి చేతుల మీదుగా కక్షిదారులకు మొక్కలు పంపిణీ చేశారు. విధిగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఉమామహేశ్వరరావు,



ప్రధాన కార్యదర్శి కీర్తి కార్తీక్, సీనియర్ న్యాయవాదులు పెద్దూరి వెంకట నరసయ్య, పప్పుల గోపీనాథ్, దంతాల ఆనంద్, ఎస్.వెంకటేశ్వర్లు, జూనియర్ న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## విమానం తోక భాగంలో ఎయిర్ హోస్టేస్ మృతదేహం



అహ్మదాబాద్:అహ్మదాబాద్‌లో ఎయిరిండియావిమానం కుప్పకూలిన ఘటనలో మరో మృతదేహం లభ్యమైంది. ప్రమాదానికి గల కారణాలను అన్వేషించేందుకు శనివారం ఉదయం శిథిలాలను తొలగిస్తుండగా విమానం తోక భాగంలో ఈ మృతదేహాన్ని గుర్తించారు. తోక భాగాన్ని తొలగిస్తుండగా లభ్యమైన మృతదేహం విమాన సిబ్బందిలోని ఎయిర్‌హోస్టెస్‌దిగా అధికారులు ధృవీకరించారు. అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే విమానాశ్రయానికి సమీపంలోని వైద్యులు, నర్సింగ్ సిబ్బంది నివాస సముదాయంపై కుప్పకూలిన విషయం తెలిసిందే.ఈ దుర్ఘటనలో విమానం చాలా వరకు మంటల్లో కాలిపోగా,తోక భాగం ఒక భవనంపై ఇరుక్కుపోయింది.

పైలట్ చివరి మాటలు

ప్రమాదానికి ముందు విమానం సీనియర్ పైలట్ కెప్టెన్ సుమిత్ సభర్వాల్ చివరి ఐదు సెకన్ల ఆడియో సందేశం ఒకటి వెలుగులోకి వచ్చింది. అందులో ఆయన "మేడే.. మేడే.. మేడే.. నో పవర్.. నో థ్రస్ట్.. గోయింగ్ డౌన్" (అపాయం.. అపాయం.. అపాయం.. శక్తి లేదు.. ఒత్తిడి లేదు.. కిందకు పడిపోతున్నాం) అని అత్యంత ఆందోళనకరంగా చెప్పినట్లు రికార్డయింది.

# సంపాదకీయం

**ఆదివారం 15-06-2025**

## జీ7సదస్సుపై ట్రంప్ నీడ

సంపన్న మిత్రదేశాల సమావేశమంటే అంతటా ఆసక్తి వ్యక్తమవుతుంది. ఆ భేటీల్లో ప్రధాన పారిశ్రామిక దేశాలు ఆశావహమైన నిర్ణయాలు తీసుకుంటాయని మిగతా ప్రపంచం ఆశిస్తుంది. ఈనెల 15-17 తేదీల్లో కెనడాలోని కెననాస్కిస్‌లో జరగనున్న 'జీ7' దేశాల 51వ శిఖరాగ్ర సభపై మాత్రం అంతగా సానుకూలతేమీ వ్యక్తం కావడం లేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సాటి జీ7 దేశాలపైనా భారీగా సుంకాలు విధించడంతో ఈ సదస్సు రసాభాస అవుతుందేమోనన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. అమెరికా, కెనడా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్‌లు కలిసి 1975లో 'గ్రూప్ ఆఫ్ సెవెన్(జీ7)' కూటమిగా ఏర్పడ్డాయి. భారత్ ఆహ్వానిత హోదాలో పాల్గొంటోంది. ఇండియా ఇంతవరకు 11 జీ7 సమావేశాల్లో పాల్గొనగా, ప్రధాని మోదీ ఒక్కరే వరుసగా అయిదుసార్లు హాజరయ్యారు. జస్టిన్ ట్రూడో హయాంలో భారత్‌తో కెనడా సంబంధాలు దెబ్బతిన్నందువల్ల, ఈసారి మోదీని ఆహ్వానిస్తారా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. పైగా కెనడా ప్రధాని కార్నీ జీ7 సభకు ప్రకటించిన ప్రాధాన్యాల్లో తమ గడ్డపై విదేశీ జోక్యాన్ని, అంతర్జాతీయ నేరాలనూ అడ్డుకోవడం వంటివి ఉన్నాయి. ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జార్ హత్య వెనక భారత్ హస్తముందని ట్రూడో జమానాలో కెనడా నిందలేసింది. కార్నీ వాటిని పట్టించుకోకుండా భారత ప్రధానిని ఆహ్వానించారు. ఐరోపా దేశాల ఒత్తిడి ఆయనపై పనిచేసినట్లుంది. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటైన ఇండియా, ముఖ్యమైన అంతర్జాతీయ సంప్రదింపుల్లో భాగస్వామి కావాల్సిందేనని కార్నీ వ్యాఖ్యానించారు. భారత్‌తోపాటు చైనా కూడా కెనడా రాజకీయాలను ప్రభావితం చేయాలని చూస్తున్నట్లు ఒక కమిషన్ ఆరోపించినా డ్రాగన్‌ను కాదని ఇండియాను ఆహ్వానించడం గమనార్హం.

'ఐమెక్'పై ప్రభావం

కెననాస్కిస్ జీ7 సభకు కార్నీ మూడు ప్రాధాన్యాలను ప్రకటించారు. ప్రపంచానికీ, స్థానిక జన సముదాయాలకూ రక్షణ కల్పించడం అందులో ఒకటోది. ఇందుకోసం శాంతి భద్రతలను కాపాడటంతో పాటు విదేశీ జోక్యాన్నీ, అంతర్జాతీయ నేరాలనూ అడ్డుకోవాలని, కార్చిచ్చుల నియంత్రణకు కలిసికట్టుగా కృషి చేయాలని ప్రతిపాదించారు. రెండో ప్రాధాన్యాంశం... ఇంధన భద్రత, డిజిటల్ రూపాంతరీకరణలను సాధించడం. దీనికోసం అధునాతన పరిశ్రమలకు అవసరమైన కీలక ఖనిజాల సరఫరాకు భరోసా సాధించాలి. కృత్రిమ మేధ(ఏఐ), క్వాంటమ్ సాంకేతికతలతో ఆర్థికాభివృద్ధిని కొత్త శిఖరాలకు తీసుకెళ్లాలని భావిస్తున్నారు. ఉజ్జ్వల భవిష్యత్తుకు సుస్థిర భాగస్వామ్యాల సాధన మూడోది. ఇందులో భాగంగా అధిక జీతభత్యాలను ఇచ్చే ఉద్యోగాలను సృష్టించాలనీ, పటిష్ఠ మౌలిక వసతుల నిర్మాణం, వ్యాపార సంస్థలు పరస్పరం పోటీపడి విజయాలు సాధించగల విపణులను నిర్మించాలని యోచిస్తున్నారు. ఉక్రెయిన్‌లో శాంతి స్థాపన, ఇతర ప్రాంతాల్లో సంఘర్షణల నివారణ, జీ7 కూటమి వెలుపలి ముఖ్యమైన దేశాలతో భాగస్వామ్యాలను పెంపొందించుకోవడం కూడా తన లక్ష్యాలేనని కార్నీ వివరించారు. ఈసారి సదస్సుకూ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీని ఆహ్వానించారు. భేటీ సందర్భంగా ట్రంప్‌తో విడిగా మాట్లాడేందుకు జెలెన్ స్కీ ఆసక్తి చూపుతున్నారు. నిరుడు ఇటలీ జీ7 సభ ఇండియా-మధ్యప్రాచ్యం-ఐరోపా ఆర్థిక నడవా(ఐమెక్) ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లాలని లక్షించింది. కానీ, హమాస్-ఇజ్రాయెల్ యుద్ధం అందుకు ఆటంకం కలిగిస్తోంది. భారత్, యూఏఈలు మాత్రం తమ పరిధిలోని ప్రాజెక్టు పనులు చేపడుతున్నాయి. కెనడా సభ ఐమెక్‌పై ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో చూడాలి. వర్ధమాన దేశాల అభ్యున్నతికి తోడ్పడే మౌలిక వసతుల నిర్మాణానికి 2027కల్లా 60వేల కోట్ల డాలర్లను సమీకరించాలని ఇటలీ సభ నిశ్చయించింది. పీజీఐఐగా వ్యవహరిస్తున్న ఈ పథకాన్ని ముందుకు తీసుకుపోవడానికి ఈసారి తీసుకునే నిర్ణయాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. 2050నాటికి కర్బన ఉద్గారాల తటస్థతను సాధించాలని నిరుడు నిర్ణయించారు. కానీ, ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష పదవి చేపట్టిన తరవాత వాతావరణ మార్పులపై సుమారు వంద అధ్యయనాలను రద్దు చేశారు. ట్రంప్ నిర్ణయాల ప్రభావం పర్యావరణ పరిరక్షణ కృషి మీద పడుతోంది.

పుతిన్‌పై ఒత్తిడి తేగలరా?

అమెరికా పొరుగున ఉన్న కెనడా, మెక్సికోలు సహా అన్ని దేశాలపైనా ట్రంప్ ఎడాపెడా సుంకాలు పెంచేశారు. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలనూ, ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలనూ తుంగలో తొక్కిన ఆయన జీ7 కూటమి ఆర్థిక తీర్మానాల అమలుకు కలిసొస్తారా? అనేది చిక్కుప్రశ్నే! ఏదిఏమైనా జీ7 దేశాలు తమ వాణిజ్య సమస్యలను పరిష్కరించుకోవడానికీ, కృత్రిమ మేధ, క్వాంటమ్ టెక్నాలజీల్లో పరస్పర సహకారానికీ... చైనా, రష్యాలతో పెరుగుతున్న ఉద్రిక్తతలను నిభాయించుకోవడానికీ కెనడా సభ వేదికగా నిలుస్తుంది. రష్యాను దారికి తీసుకురావాలంటే చమురు నుంచి వచ్చే ఆదాయానికి భారీగా గండి కొట్టాలని జీ7లోని ఐరోపా సభ్యదేశాలు భావిస్తున్నాయి. పీపా చమురు విక్రయ ధరను 60డాలర్ల నుంచి 50డాలర్లకు తగ్గించాలని ప్రతిపాదిస్తున్నారు. ఈ మేరకు రష్యా అధినేత పుతిన్‌పై ఒత్తిడి తీసుకురావడానికి ట్రంప్ కలిసివస్తారా? ఉక్రెయిన్‌లో భారీ భూభాగాన్ని రష్యా ఆక్రమించడాన్ని జీ7 వ్యతిరేకిస్తుంటే, ట్రంప్ ఏమో గ్రీన్‌ల్యాండ్, కెనడాలను కలిపేసుకోవాలని చూస్తుండటం తలనొప్పిగా మారింది.

వర్ధమాన దేశాల ప్రతినిధిగా...

కొనుగోలుశక్తి పరంగా ప్రపంచ జీడీపీలో జీ7 వాటా తగ్గిపోతోంది. 2000 సంవత్సరంలో 40శాతంగా ఉన్న జీ7 వాటా ఇప్పుడు 30శాతం దిగువకు పడిపోయింది. మరోవైపు భారత్, చైనాలు ఆర్థికంగా విజృంభించి తమ వాటా పెంచుకుంటున్నాయి. చైనా చవక ఎగుమతులతో తమ మార్కెట్లను ముంచెత్తడం ద్వారా తమ పరిశ్రమలనూ, ఉపాధి వ్యాపారాలనూ దెబ్బతీస్తోందని జీ7 దేశాల్లో ఆగ్రహ నిరసనలు గూడుకట్టుకున్నాయి. ఈ ఒక్క అంశమే అంతర్జాతీయ వాణిజ్యంపై జీ7ను ఒక్కతాటి మీదకు తీసుకొచ్చే అవకాశముంది. చైనాను ఎదుర్కోవాలంటే భారత్ తోడ్పాటు అవసరమని జీ7కు తెలుసు. ప్రధాని మోదీ కెనడా సభలో యావత్ వర్ధమాన దేశాల ప్రతినిధిగా వ్యవహరించవచ్చు. ట్రంప్, కార్నీలతో ఆయన విడిగా జరిపే సమావేశాలు భావి సంబంధాలను ఏ మలుపు తిప్పుతాయో

## ఆన్‌లైన్ యాప్‌లు,మాల్‌ల దెబ్బకు.. చితికిపోతున్న చిరు వ్యాపారులు



హైదరాబాద్, వీధి వ్యాపారులు, చిన్న చిన్న దుకాణాలు నిర్వహిస్తూ కుటుంబాలను పోషించుకునే చిరు వ్యాపారుల పాలిట క్విక్ కామర్స్ డెలివరీ సంస్థలు, షాపింగ్ మాల్స్ , సూపర్ మార్కెట్లు శాపంగా మారుతున్నాయి. ఆన్‌లైన్ డెలివరీలు, డిస్కౌంట్లతో మాల్స్, క్విక్ కామర్స్ సంస్థలు చూపే ఆశలతో కొనుగోళ్లు తగ్గిపోయి రోడ్ల వెంట, కాలనీల్లోని ఉండే పండ్లు, కూరగాయలు, కిరాణా దుకాణాలు వెలవెలబోతున్నాయి. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న క్విక్ కామర్స్ యాప్‌లు, సూపర్ మార్కెట్లు చిరు వ్యాపారులకు ఉపాధి లేకుండా చేస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో చిరు వ్యాపారాల మీదనే ఆధారపడి జీవించే వేలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అమ్మకాలు తగ్గడంతో కుటుంబ పోషణ భారంగా మారుతున్నదని వీధి వ్యాపారులు, చిన్న చిన్న దుకాణాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన మూడేండ్లుగా దుకాణాల అద్దెలు కూడా చెల్లించలేని దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. నగరంలో కరోనా మహమ్మారి సృష్టించిన అలజడికి ఇంటి అద్దెలతో పాటు అన్ని వస్తువుల ధరలు అమాంతం పెరిగాయి. ఆన్‌లైన్ సేవలు విస్తృతం కావడంతో అన్నింట్లోకి క్విక్ కామర్స్ సంస్థల డెలివరీ విధానం వచ్చింది. దీంతో పండ్లు, కూరగాయలు, పాల ప్యాకెట్ల నుంచి మాంసం ఉత్పత్తుల దాకా అన్నీ ఆన్‌లైన్ బుకింగ్స్‌తో ఇంటి వద్దకే వచ్చేంతగా మారిపోయింది. దీని ప్రభావం వీధి వ్యాపారాలు, కిరాణా దుకాణాలపై తీవ్రంగా పడింది. చేసేదేమీ లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో నగరంలోని చాలా ప్రాంతాల్లోని రోడ్ల వెంట ఉన్న చిరు వ్యాపారులు, కాలనీల్లో ఉన్న చిన్న చిన్న దుకాణాలను మూసేస్తున్నారు.

వెలవెలబోతున్న వారాంతపు సంతలు

ఆన్‌లైన్ క్విక్ కామర్స్ యాప్‌లు వచ్చిన తర్వాత ప్రజలు తోపుడు బండ్లు, రోడ్ల వెంట ఉండే చిన్నచిన్న పండ్లు, టిఫిన్ బండ్లు, కూరగాయల దుకాణాలు, కిరాణా షాపులు, వారంతపు సంతలకు వెళ్లడం పూర్తిగా తగ్గించేశారు. రద్దీగా ఉండే కాలనీల్లో ఏర్పాటు చేస్తున్న వారాంతపు సంతలు వెలవెలబోతున్నాయి. పండ్లు, కూరగాయలు, నిత్యావరసర సరకులను ఆర్డర్ చేసిన నిమిషాల్లోనే ఇండ్లకు చేరుతుండటంతో ఆన్‌లైన్ విధానం వైపే మొగ్గు చూపుతున్నారు. తక్కువ సమయంలో ఇండ్లకు చేర్చడంతో పాటు ఆఫర్ల పేరిట దుకాణాల్లోని ధరల కంటే తక్కువకే ఇస్తున్నారు. బయట దొరికేదాని కంటే తక్కువకే ఇస్తుండటంతో ప్రజలు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసేందుకే మొగ్గు చూపుతున్నారు. మరోవైపు తొలిసారి బుక్ చేసుకున్నవారికి క్యాష్ బ్యాక్, ప్రత్యేక ఆఫర్లను అందిస్తుండటంతో వినియోగదారులు క్విక్ కామర్స్ యాప్‌లకు ఆకర్షితులవుతున్నారు. ధరలు కూడా అందుబాటులో ఉండటం, సమయం ఆదా అవుతుండటంతో బయట కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదని వినియోగదారులు భావిస్తున్నారు. ఇదంతా చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. కొనుగోళ్లు, ఆదాయం గతం కంటే సగానికి పడిపోవడంతో ఉపాధి కోల్పోతున్నారు.

డిస్కౌంట్లతో ఆకట్టుకుంటున్న మాల్స్, సూపర్ మార్కెట్లు

గ్రేటర్ హైదరాబాద్‌లో పుట్టుకొస్తున్న మాల్‌లు, సూపర్ మార్కెట్లు కూడా కిరాణా దుకాణాలపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి. సూపర్ మార్కెట్లలో నిత్యావసర సరకులు, కూరగాయలు, పండ్లు, ఇతర వస్తువులు తక్కువ ధరలకు లభిస్తాయనే భావనతో వినియోగదారులు నెలకు సరిపడా తీసుకునేందుకు వాటిపైనే ఆధారపడుతున్నారు. అదేవిధంగా కిరాణా, కూరగాయలు, పండ్లతో పాటు పాలు, దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, గృహోపకరణాలన్నీ సూపర్ మార్కెట్లలో ఉండటంతో అన్ని వస్తువులు ఒకే దగ్గర, ఒకేసారి తీసుకోవచ్చని ప్రజలు వాటివైపు మొగ్గు చూపుతున్నారు. సూపర్ మార్కెట్లలో ఒకేసారి అన్ని రకాల వస్తువులను తక్కువ ధరలకు కొనుగోలు చేయడంతో పాటు సమయం కూడా కలిసొస్తుందనే భావనతో కిరాణా దుకాణాలు, కూరగాయల దుకాణాలు, వారాంతపు సంతలకు వెళ్లడంలేదు. నగరంలో పెరుగుతున్న పాశ్చాత్య సంస్కృతికి పేద, మధ్య తరగతి ప్రజలు అలవాటు పడుతున్నారు. దీంతో మాల్స్, సూపర్ మార్కెట్లలో ఏర్పాటు చేసిన వసతులకు ఆకర్షితులవుతున్నారు. ఆఫర్లు, తక్కువ ధరలు ఉంటుండటం కూడా వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి.

నాణ్యత లేదు..

ఆన్‌లైన్ ఆర్డర్లకు పెరుగుతున్న విపరీతమైన డిమాండ్‌ను క్విక్ కామర్స్ సంస్థలు క్యాష్ చేసుకుంటున్నాయి. నాణ్యత లేని సరకులు, కూరగాయలను సరఫరా చేస్తూ వినియోగదారుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. ఇటీవల ముంబై నగరంలోని జెప్టో గోడౌన్ డంపింగ్ యార్డులా దర్శనమివ్వడమే దీనికి నిదర్శనం. బూజుపట్టిన ఆహార పదార్థాలు, కుళ్లిన కూరగాయలను ప్రజలకు సరఫరా చేస్తుండటాన్ని అక్కడి అధికారులు బట్టబయలు చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లోనూ పలు హోటళ్లు, మాల్స్‌ల్లో శుభ్రత లోపించి, కుళ్లిన మాంసం, ఆహారపదార్థాలు పట్టుబడుతున్నాయి. వీటినే జెప్టో, బిగ్ బాస్కెట్, బ్లింకిట్ వంటి క్విక్ కామర్స్ సంస్థలు డెలివరీ చేస్తున్నాయి. ఆఫర్లు, డిస్కౌంట్ల పేరిట వినియోగదారులు కూడా అవేమీ పట్టించుకోవడం లేదు. ఆన్‌లైన్ ఆర్డర్ల ద్వారా కొనుగోలు చేసిన ఆహార పదార్థాలు తిని రోగాల బారిన పడే ప్రమాదముంది. వీలైనంత వరకు ఆన్‌లైన్ డెలివరీలను నమ్ముకోకుండా దుకాణాల్లో నచ్చిన, నాణ్యమైన వస్తువులు కొనుగోలు చేసుకోవడం మంచిదని నిపుణులు సైతం సూచిస్తున్నారు. దీంతో చిరు వ్యాపారులకు ఆర్థిక చేయూత ఇవ్వడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చని అభిప్రాయపడుతున్నారు.

ఆన్‌లైన్ డెలివరీలతో పడిపోయిన అమ్మకాలు

నేను నార్సింగిలో ఆరేండ్లుగా కూరగాయల దుకాణం నిర్వహిస్తున్నా. ఇటీవల ఆన్‌లైన్ డెలివరీ యాప్‌ల ప్రభావం నాలాంటి చిరు వ్యాపారులపై తీవ్రంగా పడింది. కూరగాయల అమ్మకాలు గతంతో పోలిస్తే 50 శాతం వరకు తగ్గాయి. కూరగాయలు కొనేందుకు కూలీ పనులు చేసుకునేవాళ్లు కూడా రావడం తగ్గించారు. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేయడం వల్ల తక్కువ ధరతో పాటు ఇంటి వద్దకే వస్తున్నాయని దుకాణాలు, వారాంతపు సంతలకు వెళ్లడం లేదు. మార్కెట్ ధరల కంటే ఆన్‌లైన్ యాప్ వాళ్లు ఎలా తక్కువకు ఇస్తున్నారో అర్థం కావడంలేదు. మా ప్రాంతంలో భవన నిర్మాణాలు జరుగుతున్నాయి కాబట్టి కొంతవరకు ఇబ్బంది లేదు. కానీ నగరంలో ప్రధాన ప్రాంతాల్లో వీధి వ్యాపారులు, చిన్న చిన్న దుకాణాల వాళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అద్దెలు చెల్లించలేక వేరే పనుల్లో చేరుతున్నారు. - రాజు, కూరగాయల దుకాణాదారుడు, నార్సింగి

## దశాబ్దాల శత్రుత్వం.. 'అణుబూచి' సాక్షిగా భగ్గుమంది



టెహ్రాన్:ఇజ్రాయెల్ అన్నంత పని చేసింది. ఇరాన్‌పై దాడి చేస్తామంటూ గత కొన్నాళ్లుగా చెప్పుకొచ్చిన టెల్ అవీవ్.. శుక్రవారం ఇరాన్‌లోని అనుమానాస్పద అణు కేంద్రాలు, శాస్త్రవేత్తలే లక్ష్యంగా మెరుపుదాడులు చేసింది. ఐఆర్‌జీసీ అధిపతి మేజర్ జనరల్ హొస్సేన్ సలామీ, న్యూక్లియర్ సైంటిస్టు డాక్టర్ ఫెరెయుద్దీన్ అబ్బాసీ, షహీద్ బెష్తీ విశ్వవిద్యాలయంలో న్యూక్లియర్ ఇంజినీరింగ్ ఫ్యాకల్టీ, డీన్ డాక్టర్ అబ్దుల్ హమీద్ మినౌచెహర్ తదితర ప్రముఖులను మట్టుబెట్టింది. అసలు ఈ రెండు దేశాలకు ఎందుకీ శత్రుత్వం? ఎప్పటి నుంచి ఇది నడుస్తోంది?

దశాబ్దాల శత్రుత్వం

ఈ రెండు దేశాల మధ్య శత్రుత్వం ఈనాటిది కాదు.. దశాబ్దాల కాలం నుంచి కొనసాగుతోంది. 1979లో ఇస్లామిక్ విప్లవం తర్వాత అమెరికా, ఇజ్రాయెల్ దేశాలను ఇరాన్ ప్రధాన శత్రువులుగా గుర్తించింది. ఆ తర్వాతి కాలంలోనూ ఆ శత్రుత్వం కొనసాగింది. టెహ్రాన్ అణ్వాయుధాలను ఉత్పత్తి చేస్తోందని ఇజ్రాయెల్ గత 20 ఏళ్లుగా ఆరోపిస్తూనే ఉంది. అయితే శాంతియుత ప్రయోజనాల కోసమే అణు కార్యక్రమం చేపడుతున్నట్లు ఇరాన్ చెప్పుకొస్తోంది. మరోవైపు ఐక్యరాజ్యసమితికి చెందిన ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఏఈఏ) మాత్రం ఇరాన్ దగ్గర అణ్వాయుధాల ఉత్పత్తికి తగినంత యురేనియం నిల్వలు ఉన్నట్లు గతంలోనే హెచ్చరించింది. 2003 వరకు ఆ దేశం వ్యవస్థీకృత అణ్వాయుధ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఐఏఈఏ తోపాటు పాశ్చాత్యదేశాలు కూడా నొక్కి చెప్పాయి. ఇరాన్ మాత్రం.. అలాంటిదేమీ లేదని చెబుతూనే.. అణ్వాయుధాల తయారీకి అవసరమైన యురేనియం నిల్వలను అభివృద్ధి చేసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే ఆ దేశం నుంచి ముప్పు పొంచి ఉందని గ్రహించిన ఇజ్రాయెల్.. అణుకేంద్రాలే లక్ష్యంగా దాడులకు దిగింది.

బలహీన పడిన యాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్

గతంలో ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రత్యక్ష దాడులకు దిగనప్పటికీ.. 40 ఏళ్లుగా ఆ దేశంతో పరోక్షంగా యుద్ధం చేస్తూనే ఉంది. ఉగ్రవాద అనుబంధ గ్రూప్‌ల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసి.. ఇజ్రాయెల్‌పైకి ఉసిగొల్పుతోంది. గాజాలో హమాస్, లెబనాన్‌లో హెజ్‌బొల్లా, యెమెన్‌లో హూతీలు, ఇరాక్, సిరియాలో మిలిషియా సంస్థలు ఆ కోవకు చెందినవే. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ ఉగ్రవాదులు దాడి చేసిన తర్వాత 'యాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్' క్రమంగా బలహీనపడటం మొదలైంది. హమాస్ ఉగ్రవాదుల నిర్మూలనే లక్ష్యంగా ఇజ్రాయెల్ యుద్ధం ప్రకటించి.. వారి స్థావరాలను నేలమట్టం చేసింది. సొరంగాలను సైతం వదల్లేదు. వారికి మద్దతుగా లెబనాన్ నుంచి హెజ్‌బొల్లా దాడులకు పాల్పడగా.. వారి మౌలిక వసతులను సైతం ఇజ్రాయెల్ దెబ్బతీసింది. ఈ తరహా చర్యలతో ఉగ్రనెట్‌వర్క్ బలహీన పడింది.

ఇప్పటికే ఆలస్యమైందా?

ఇరాన్ నుంచి ముప్పు పొంచి ఉందని ఎప్పుడో గ్రహించిన ఇజ్రాయెల్.. అనువైన సమయం కోసం వేచి చూసింది. ఓ వైపు ఉగ్రనెట్‌వర్క్ బలహీనపడటం, మరోవైపు అణు కార్యక్రమానికి సంబంధించి అమెరికా చేస్తున్న ప్రతిపాదనలను ఇరాన్ పదే పదే తిరస్కరించడం ఇజ్రాయెల్‌కు బాగా కలిసి వచ్చాయి. ఈ సమయంలో దాడి చేస్తే, అమెరికా నుంచి ఇరాన్‌కు మద్దతు ఉండదు. పైగా, పరోక్షంగా అగ్రరాజ్యం ఇజ్రాయెల్‌కు సాయం చేస్తుంది. వీటితోపాటు టెహ్రాన్ భారీ మొత్తంలో యురేనియం నిల్వలను సమకూర్చుకోవడం ఇజ్రాయెల్‌ను ఒకింత భయానికి గురి చేసింది. అణ్వాయుధాలను ఉత్పత్తి చేసి.. తమ దేశంపై ప్రయోగిస్తుందన్న భయంతో ముందుగానే ఆయా కేంద్రాలను నేల మట్టం చేయాలని నిర్ణయించి.. దాడులకు దిగింది. ఇదే విషయాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా స్పష్టం చేశారు. ' మా మనుగడను సవాల్ చేసే ఇరాన్ ముప్పును తిప్పికొట్టేందుకే ' ఆపరేషన్ రైజింగ్ లయన్' చేపట్టాం' అని నెతన్యాహు బహిరంగ ప్రకటన చేశారు. ఇప్పటికే ఆలస్యమైందని, ముప్పును పూర్తిగా తొలగించేంత వరకు ఆపరేషన్ కొనసాగుతుందని స్పష్టం చేశారు. మరోవైపు ఇరాన్ కూడా ప్రతిదాడులు ప్రారంభించింది. భారీ సంఖ్యలో డ్రోన్లను ప్రయోగిస్తోంది. ఈ నేపథ్యంలో.. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు ఇంకెన్నాళ్లు కొనసాగుతాయో చెప్పలేని పరిస్థితులు తలెత్తాయి. ఇప్పటికే రెండు యుద్ధాలతో సతమతమవుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తాజా పరిస్థితులు ఇంకెలాంటి ప్రభావం చూపిస్తాయోనని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఎసిబి కేసుల్లో నిజాలు తేలుద్దామా...

హైదరాబాద్, సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసెడింట్ కేటీఆర్ ఫైరయ్యారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ ట్వీట్ చేశారు. ముఖ్యమంత్రి ప్రజల దృష్టి మరల్చేందుకు పూటకో వేషం వేస్తున్నాడు.. రోజుకో కుట్ర చేస్తున్నాడు..ఫార్ములా ఈ రేసు నిర్వహణ కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం, బ్యాంకు ద్వారా పంపిన 44 కోట్ల రూపాయలు ఇప్పటికీ ఫార్ములా ఈ సంస్థ అకౌంట్ లోనే ఉన్నా, వాటిని వెనక్కి రప్పించడం చేతకాని ముఖ్యమంత్రి మరోసారి ఏసీబీ నోటీసులు పంపాడు. చట్టాలను గౌరవించే పౌరుడిగా, తప్పకుండా సోమవారం ఉదయం 10 గంటలకు ఏసీబీ విచారణకు హాజరవడంతోపాటు-.. విచారణకు అన్నివిధాలుగా సహకరిస్తానని మాటిస్తున్నాను. అయితే, పదేళ్ల క్రితం నోటుకు ఓటు కుంభకోణంలో నోట్లకట్టలున్న నల్లబ్యాగుతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ రేవంత్ రెడ్డి కేసు కూడా ఇదే ఏసీబీ పరిధిలో పెండింగ్‌లో ఉంది. ఇద్దరిపై కూడా ఏసీబీ కేసులున్న నేపథ్యంలో.. ఇద్దరిలో దోషులెవరో, నిర్దోషులెవరో తేల్చేందుకు జడ్జి సమక్షంలో లైవ్ టెలివిజన్ సాక్షిగా లై డిటెక్టర్ టెస్టును ఎదుర్కొనే దమ్మూ, ధైర్యం ఈ పిరికి ముఖ్యమంత్రికి ఉన్నదా? అని ప్రశ్నించారు. ఓవైపు మీ దివాళాకోరు విధానాలతో రాష్ట్ర ఖజానా ఖాళీ అని ఓ ముఖ్యమంత్రిగా నిస్సిగ్గుగా మీ అసమర్థతను చాటుకుంటున్న ఈ తరుణంలో.. విచారణల కోసం ప్రజాధనాన్ని వృధా చేయడం మానుకుని, వెంటనే లై డిటెక్టర్ టెస్టుకు సీఎం రేవంత్ సిద్ధం కావాలని పేర్కొన్నారు.

## నగరంలో పలుచోట్ల వర్షం

హైదరాబాద్,నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. దీంతో వాహనాలపై వెళ్తున్న వాహనదారులు తడిసి ముద్దయ్యారు. నగరంలోని బేగంబజార్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, బషీర్ బాగ్, నాంపల్లి, లిబర్టీ, హిమాయత్ నగర్, నారాయణగూడ, లక్డీకాపుల్, ఖైరతాబాద్, ట్యాంక్ బండ్ తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై వరద చేరడంతో వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నైరుతి రుతుపవనాలు మరింత విస్తరించడంతో తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి.. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఐదు రోజులపాటు- మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవనున్నాయి. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ విభాగం వెల్లడించింది. దక్షిణ, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురవచ్చని.. గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని తెలిపింది. ఇవాళ ఉమ్మడి మహబూబ్‌నగర్, నిజామాబాద్, మెదక్, నల్గొండతో పాటు- వికారాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే వీలుందని తెలిపింది. రుతుపవనాల ప్రభావంతో హైదరాబాద్‌లో పలుచోట్ల వర్షం కురిసింది. ఈ ఏడాది రాష్ట్రంలో సాధారణ కంటే ఎక్కువ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో గోదావరి కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో వీలైనంత వరకు ప్రాణ, ఆస్థి, ఆర్థిక నష్టం జరగకుండా ఇప్పటి నుండే పకడ్బందీ చర్యలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. గోదావరి, కృష్ణా నదీ పరీవాహక ప్రాంతా ల్లో వరద నిర్వహణపై ఆయా జిల్లాల కలెక్టర్లతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగిన తర్వాత స్పందించే దానికంటే నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. హైదరాబాద్ తరహాలోనే రాష్ట్ర స్థాయిలో ప్రధానంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్య లు, విపత్తుల నిర్వహణా విభాగం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై హైడ్రా కమిషనర్, అగ్నిమాపక డిజీ, విపత్తుల నిర్వహణ కమిషనర్, కమాండ్ కంట్రోల్ సెంట ర్ డైరెక్టర్, నీటిపారుదల, ఆర్ అండ్ బి, ఆరోగ్య శాఖల కమిషనర్లతో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, ఈ కమిటీ- వారం రోజుల్లో నివేదిక ఇస్తుందని కమిటీ- నివేదిక ప్రకారం చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు.

## సిఆర్‌డిఎ టెంటర్లకు ఆమోదం

అమరావతి, ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఉండవల్లిలోని నివాసంలో సీఆర్‌డీఏ అథారిటీ- 49వ సమావేశం జరిగింది. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ పరిధిలోని 1,450 ఎకరాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ. 1,052 కోట్లతో టెండర్లు పిలవడానికి ఆమోదించింది. సీడ్ యాక్సెస్ రోడ్‌ను నేషనల్ హైవేకు కలిపేందుకు రూ. 682 కోట్లతో టెండరు పిలవాలని నిర్ణయించారు. గ్రీన్ అండ్ బ్లూ సిటీ- నిర్మాణంపై నిపుణులతో మాట్లాడామని పట్టణాభివృద్ధి శాఖమంత్రి నారాయణ తెలిపారు. ఉత్తర ప్రదేశ్ పర్యటనలో లక్నో లో రివర్ బండ్ ఎలా కట్టారు.. అక్కడ సాలిడ్ వేస్ట్ ప్లాంట్లు- ఎలా ఉన్నాయనేది అధ్యయనం చేశామన్నారు. యూపీ అధికారులు కూడా ఇక్కడకు వచ్చి సాలిడ్ వేస్ట్ ప్లాంట్లపై అధ్యయనం చేయనున్నారని వివరించారు.

## మృతుల కుటుంబాలకు తక్షణ పరిహారం

న్యూఢిల్లీ,అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమానం ప్రమాదానికి సంబంధించి ఇద్దరు వైద్యులు సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలు చేశారు. తక్షణమే సుమోటోగా విచారణ చేపట్టి, బాధిత కుటుంబాలకు తగిన పరిహారం అందించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. మృతుల కుటుంబాలకు అహ్మదాబాద్‌లోని బిజె మెడికల్ కాలేజీ రెసిడెంట్ వైద్యులతో సహా ఒక్కొక్కరికి రూ. 50 లక్షల మధ్యంతర పరిహారాన్ని వెంటనే ప్రకటించాలని, వెంటనే పంపిణీ చేయాలని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు లేదా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తులు, విమానయాన నిపుణులు, ఆర్థికవేత్తలు, బీమా సంస్థల నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు- చేయాలని పిటిషన్‌లో అభ్యర్థించారు. త్రివేణి కోడ్కనీ వర్సెస్ ఎయిర్ ఇండియా లిమిటెడ్ కేసులో సుప్రీంకోర్టు ఏర్పాటు- చేసిన సూత్రాల ప్రకారం.. బాధిత కుటుంబాలకు తుది పరిహారాన్ని ఈ కమిటీ నిర్ణయించాలని స్పష్టం చేశారు. దీనితో పాటు-, బాధిత కుటుంబాలు సుదీర్ఘ న్యాయ ప్రక్రియ ద్వారా వెళ్ళాల్సిన అవసరం లేకుండా.. పరిహారం క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించడానికి ఎయిర్ ఇండియా లిమిటెడ్‌ను ఆదేశించాలని పిటిషన్ కోరారు. మృతులకు అర్హులైన బంధువులకు పునరావాస సహాయం, ఉపాధి అవకాశాలు కల్పించేలా కేంద్ర ప్రభుత్వానికి దిశానిర్దేశర చేయాలని పిటిషన్‌లో కోరారు. అలాగే.. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, భవిష్యత్తులో ఇలాంటి విషాదాలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని పిటిషనర్లు సుప్రీంకోర్టును అభ్యర్థించారు.

## ఎంతెంత దూరం...?

హైదరాబాద్,చిన్నప్పుడు "ఎంతెంత దూరం.. చాలా చాలా దూరం!" అంటూ రైలాట ఆడుకున్న విషయం గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు సేమ్ టు సేమ్ బీఆర్ ఎస్‌లోనూ ఇదే తరహా పరిస్థితి కనిపిస్తోంది. కేసీఆర్‌ను దేవుడు అంటూ.. ఆయన చుట్టూ దయ్యాలున్నాయని వ్యాఖ్యానించిన బీఆర్ ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత వ్యవహారంపై ఆమె తండ్రి, బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ కూడా.. చాలా చాలా దూరంగానే ఉంటున్నారు. తాజాగా ఆమె.. తండ్రిని కలుసుకునేందుకువెళ్లినా.. ఆయన కనీసం పలకరించలేదని వార్తలు వచ్చాయి. గతంలో కేసీఆర్ ఎక్కడికి బయలు దేరినా.. తన కుమార్తెతో భుజానికి పార్టీ గుర్తును కట్టించుకునేవారు లేదా .. నుదిటన బొట్టు పెట్టించుకునేవారు. కానీ, తాజాగా కాళేశ్వరం కమిషన్ విచారణకు కేసీఆర్ హాజరయ్యేందుకు బయలు దేరే సమయంలో కవితను ఆయన కనీసం పట్టించుకోలేదు. అంతేకాదు.. కనీసం పన్నెత్తి కూడా పలకరించలేదు. దీంతో కేసీఆర్.. కవితకు .. మధ్య ఎంతెంత దూరం పెరుగుతోందంటే.. చాలా చాలా దూరమే పెరుగుతోందని పరిశీలకులు చెబుతున్నారు. కేసీఆర్ చాటు బిడ్డగా రాజకీయాల్లోకి వచ్చినా.. ఆయన దన్నుతోనే రాజకీయంగా కవిత ఎదిగారు. కానీ, ఇటీ వల ఆధిపత్య ధోరణి ప్రదర్శించారు. ఈ క్రమంలోనే బీఆర్ ఎస్ కండువాను కూడా పక్కన పెట్టారు. సహ జంగా కేసీఆర్ తనను ఏమన్నా.. కొంత మేరకు సహిస్తారు కానీ.. పార్టీ కండువాను తృణీకరిస్తే.. మాత్రం ఆయన అస్సలు సహించరు. బహుశ .. కవిత విషయంలోనూ ఇదే జరిగి ఉంటుందన్న భావన వ్యక్తమవు తోంది. కవిత 'డియర్ డాడీ' లేఖ తర్వాత.. నిర్వహించిన ప్రెస్ మీట్లు వివాదమయ్యాయి. ఆ తర్వాత. బయటకు వచ్చినప్పుడు కూడా.. బీఆర్ ఎస్ కండువా కప్పుకోలేదు. ఈ పరిణామాలకు తోడు దెయ్యాలంటూ వ్యాఖ్యానించడం కూడా కేసీఆర్‌ను తీవ్రంగా కుదిపేసింది. కేసీఆర్ నాయకత్వాన్ని ఆమె నేరుగా ప్రశ్నించకపోయినా.. అంతే చేశారన్న గుసగుస కూడా వినిపిస్తోంది. ఆడబిడ్డకు అన్యాయం చేస్తారా? అంటూ.. ప్రశ్నలు కూడా గుప్పించారు. వెరసి ఇవన్నీ.. కేసీఆర్ మదిలో తిరుగుతూనే ఉన్నాయి. అందుకే.. ఏరికోరి కుమార్తె ఇంటికి వచ్చినా.. ఆయన కనీసం పలకరించకుండానే వెళ్లిపోయారని పార్టీలో చర్చ నడుస్తోంది.

# చంద్రబాబుకు చెంపపెట్టు

అమరావతి,నిరంకుశంగా, అప్రజాస్వామికంగా, అరాచకంగా వ్యవహరిస్తున్న..ఎపి సిఎం చంద్రబాబు నాయుడుకు సుప్రీం కోర్టు గట్టిగా బుద్ధి చెప్పిందని వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీనియర్ జర్నలిస్టు కెఎస్‌ఆర్ ను వెంటనే విడుదల చేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలు చంద్రబాబుకు చెంపపెట్టు వంటిదని అన్నారు. ప్రాథమిక హక్కులకు, స్వేచ్ఛకు..తీవ్ర భంగకరమని కోర్టు చెప్పడం ముదాహం అని జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు.అమరావతి నిర్మాణం పేరిట వేల కోట్ల అవినీతి నుంచి, తన పాలనా వైఫల్యాల నుంచి, క్షీణించిన లా అండ్ ఆర్డర్ పరిస్థితులపై తీవ్రంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రజల దృష్టిని మళ్లించడానికి తన ఎల్లో ముఠాతో కలిసి చంద్రబాబు కృత్రిమ వివాదాన్ని సృష్టించారు. అబద్ధాలు, మోసాలతో కూడిన పాలననుంచి మళ్లించడానికి, తాను చేయని వ్యాఖ్యలను కొమ్మినేనికి ఆపాదించి, దానిచుట్టూ తన ఎల్లో గ్యాంగ్‌ద్వారా పథకం ప్రకారం విషప్రచారం చేయించారు. వాటిని పట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా రౌడీయిజం చేశారు, ఆస్తులను ధ్వంసం చేశారు. మహిళల నిరసన పేరుతో ఒక ముసుగు వేసుకుని సాక్షి మీడియా యూనిట్ ఆఫీసులమీద, కార్యాలయాలమీద అరాచకంగా దాడులు చేయించారు. మీడియా స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని కాలరాశారు. చంద్రబాబు తన తప్పును తెలుసుకోకుండా ఇంకా ఆ వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీకి, సాక్షి మీడియాకు ఆపాదిస్తూ జుగుప్సాకరంగా నిన్న మాట్లాడ్డంతోనే ఆయన రాజకీయ లబ్ధికోసం ఈ కుట్రపన్నారని అర్థం అవుతోంది. విశ్లేషకుడు వ్యాఖ్యలతో యాంకర్‌గా వ్యవహరించిన కొమ్మినేనికి ఏం సంబంధం అంటూ? ఇవాళ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆర్డర్ చంద్రబాబు కుట్రను బద్దలు చేసింది, ఎండగట్టింది. తద్వారా ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ అరెస్టుల అంశం మరోసారి దేశం దృష్టికి వెళ్లింది. వక్రీకరణలు, అబద్ధాలు ఎల్లకాలం చెల్లుబాటు- కావు'అని ట్వీట్‌లో పేర్కొన్నారు.

# బురదరాజకీయాలు చేసిన కూటమి పార్టీలు

అమరావతి, సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమ అరెస్ట్‌పై సుప్రీంకోర్ట్ ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి అన్నారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మహిళలను కించపరిచారంటూ లేని దానిని ఆపాదిస్తూ కూటమి పార్టీల నేతలు తాము చేసిన బురద రాజకీయంకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగంతో అరాచకం సృష్టించాలనుకుంటే కుదరదనే విధంగా సుప్రీంకోర్ట్ తీర్పు ప్రజాస్వామిక స్ఫూర్తిని నిలబెట్టిందని అన్నారు. ఈ దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ, పత్రికాస్వేచ్ఛను పరిరక్షిస్తూ సుప్రీంకోర్ట్ కొమ్మినేని అరెస్ట్‌పై ఇచ్చిన ఉత్తర్వులను ప్రజలు స్వాగతిస్తున్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నిరంకుశంగా, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారు. వారి సొంత రెడ్‌బుక్ రాజ్యాంగాలు చెల్లవు, భారత రాజ్యాంగం ప్రకారమే ఎవరైనా పాలన చేయాలని మరోసారి సుప్రీంకోర్ట్ తన తాజా ఉత్తర్వులతో చెప్పినట్లయ్యింది. ఏపీలో ఏడాది పాలనలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారు. మహిళలకు రాష్ట్రంలో రక్షణ లేదు. అమరావతి పేరుతో పెద్ద ఎత్తున దోపిడీకి తెగబడ్డారు. తన అసమర్థ పాలన నుంచి ప్రజల దృష్టిని మళ్ళించేందుకు సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్ట్, సాక్షి మీడియా కార్యాలయాలపై దాడులతో ఒక అరాచకాన్ని సృష్టించారు. అటు-వంటి భయానక పరిస్థితుల్లో ప్రజాస్వామిక స్ఫూర్తిని పరిరక్షిస్తూ సుప్రీంకోర్ట్ ఈ రోజు వెలువరించిన తీర్పు చంద్రబాబు అరాచకాలకు గొడ్డలిపెట్టు-. గడిచిన మూడు రోజులుగా మహిళలను అవమానించారనే వక్రీకరణలను ఆపాదిస్తూ వైఎస్సార్‌సీపీ, వైఎస్ జగన్, ఆయన సతీమణి భారతమ్మ, సాక్షి మీడియా పైనా, సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావుపైనా చేసిన దుష్ప్రచారం, కూటమి ప్రభుత్వ కుట్రలు సుప్రీంకోర్ట్ ఉత్తర్వులతో మొత్తం దేశమంతా తెలిసింది. ఇటు-వంటి దుర్మార్గానికి పాల్పడిన వారంతా వైఎస్ జగన్, వైఎస్ భారతమ్మకు క్షమాపణలు చెప్పాలి. ఈ వివాదాన్ని రెచ్చగొట్టేలా చేసిన రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఇప్పటి-కై-నా సుప్రీంకోర్ట్ ఉత్తర్వులతో తన బుద్ధి మార్చుకోవాలి. బాధ్యతాయుతమైన మహిళా మంత్రులు పోలీస్ స్టేషన్‌లకు వెళ్ళి ఫిర్యాదులు ఇచ్చి, తప్పుడు కేసులు బనాయించేందుకు కుట్రపూరితంగా వ్యవహరించారు. ఇటు-వంటి తప్పుడు విధానాలకు పాల్పడినందుకు వారు తమ పదవులకు రాజీనామా చేయాలి' అని ఆమె డిమాండ్ చేశారు.

# టేకాఫ్ కాగానే ప్రమాదానికి అదే కారణం

అహ్మదాబాద్,గుజరాత్ రాష్ట్రంఅహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలి 241 మంది ప్రాణాలు కోల్పోవడం దేశాన్ని దిగ్భ్రమలో ముంచింది. ఎందుకిలా జరిగిందన్న విశ్లేషణలు మొదలయ్యాయి. విమానానికి ఉన్న రెండు ఇంజన్లు ఫెయిల్ కావడం అన్నది అరుదైన విషయంగా పలువురు నిపుణులు భావిస్తున్నారు. అదికూడా టేకాఫ్ అయిన నిముషాల్లోనే జరగడం వంది అరుదని చెబుతున్నారు. ఇంజన్‌లో సాంకేతిక సమస్య వల్లే అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం జరిగిందని చెబుతున్నారు. విమానానికి ఉన్న రెండు ఇంజన్లు ఫెయిల్ కావడం వల్ల ప్రమాదం జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు.ఒక ఇంజన్‌లో సాంకేతికంగా లోపం వస్తే మరో ఇంజిన్‌తో విమానం నడుస్తుంది. కానీ గురువారం జరిగిన అహ్మదాబాద్ ప్రమాద సంఘటనలో రెండు ఇంజన్లు ఫెయిల్ కావడంతో ప్రమాదం జరిగిందని అంటున్నారు. ఇదో అరుదైన ఘటనగా వారు చెబుతున్నారు. ఇలాంటి సందర్భాలు తక్కువని భావిస్తున్నారు.రెండు ఇంజన్లకు ఇంధనం అందకపోవడం వల్ల ఒక్కసారిగా కుప్పకూలి పోయి ఉంటుందని అన్నారు. టేకాఫ్ అయిన క్షణాల్లోనే విమానానికి సిగ్నల్ వ్యవస్థ కట్ అయిందని... ఇంధనం కూడా అందలేదని అందుకే విమానం కూలిందని అన్నారు. విమాన ప్రమాదాలను మూడు రకాలుగా చూస్తారు. పక్షులు ఢీ కొట్టినా , వాతావరణం ప్రతికూలంగా ఉన్నా, టెక్నికల్ ఎర్రర్ వచ్చినా ప్రమాదాలు జరుగు తుంటాయి. దేశంలో ఇప్పటి వరకు రెండు ఇంజన్లు ఫెయిల్ అయ్యి ప్రమాదం జరగడం ఇదే మొదటిసారి. బ్లాక్ బాక్స్‌ను డీకోడ్ చేస్తే కెప్టెన్, పైలెట్ ఏం అలర్ట్ ఇచ్చారో తెలుస్తుంది. కెప్టెన్ మే డే అని అలర్ట్ అయితే ఏటీసీకి అందజేసినట్లు తెలుస్తోంది. రెండు ఇంజన్లు ఫెయిల్ అయినప్పుడు ఏటీసీ కూడా ఏమీ చేయలేదు . ఏటీసీ కేవలం సిగ్నల్ వ్యవస్థతో పాటు అబ్జర్వేషన్‌ను మాత్రమే చేయగలదని చెప్పుకొచ్చారు. 787 డ్రీం లైనర్ విమానం అత్యంత పటిష్టమైనదన్నారు. టెక్నికల్ సమస్యలు తక్కువగా వస్తాయన్నారు. గత 11 ఏళ్లుగా ఈ విమానం సేవలు అందిస్తోంది. కానీ తాజాగా జరిగిన ప్రమాదంలో మాత్రం 787 డ్రీమ్ లైనర్ కూడా ఫెయిల్ అయింది. నిజానికి విమానం బయలుదేరడానికి ముందు టెక్నికల్ సిబ్బంది తనిఖీలు చేస్తారు. వారు ఎలాంటి ఎర్రర్‌ను గుర్తించకపోవడం అన్నది అనుమానాలకు తావిస్తోంది. అందుకే అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై బ్లాక్ బాక్స్ డీకోడ్ చేస్తే అసలు విషయం తెలుస్తుందని నిపుణులు అంటున్నారు. బ్లాక్ బాక్స్‌లో కేవలం పైలట్, కో పైలట్ మాత్రమే వాయిస్ రికార్డు అవుతాయి తప్ప.. ప్రయాణికుల వాయిస్‌లు రికార్డ్ కావు. పైలెట్, కో పైలట్ ప్రయాణికులకు ఏదైనా అలర్ట్ చేసినా, సూచనలు చేసినా అవి రికార్డు అయ్యే ఛాన్స్ ఉంటుది.

# జమిలి వస్తే ఏయే రాష్ట్రాల్లో.. పదవీకాలం కటాఫ్ అవుతుంది..? కలిసి వచ్చే పార్టీలేంటి?




న్యూఢిల్లీ,జమిలి ఎన్నికలపై వ్యవహారం మెల్లగా ముందుకు కదులుతోంది. ఇప్పటికే పార్లమెంట్ ముందుకు బిల్లు తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం.. జాయింట్ పార్లమెంటరీ కమిటీని కూడా ఏర్పాటు చేసింది. సో ఇప్పుడు ఆ జేపీసీ సంప్రదింపుల్లో బిజీబిజీగా ఉంది. యూపీ, ఉత్తరాఖండ్ లో పర్యటించింది. అభిప్రాయాలు తెలుసుకుంది. ఎటు చేసి వన్ నేషన్, వన్ ఎలక్షన్ కు రోడ్ మ్యాప్ క్లియర్ చేస్తున్నట్లుగానే పరిస్థితులు చూస్తే అర్థమవుతోంది. అంతా కుదిరితే 2034 నుంచి సింగిల్ పోల్ ను వర్కవుట్ చేసే ప్రయత్నాల్లో ఉన్నారు.

వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై పెరిగిన స్పీడ్

భారత్ లో జమిలి ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఒకే దేశం ఒకే ఎలక్షన్.. విషయంపై మోడీ ప్రభుత్వం చాలా సీరియస్ గానే వర్కవుట్ చేస్తోంది. మాటిమాటికీ ఎన్నికలు రావడం, ఏదో ఒక రాష్ట్రంలో, ఏదో ఒక ప్రాంతంలో పోలింగ్ తో ఎలక్షన్ కోడ్ లు, అభివృద్ధి ఆగడం ఇవన్నీ సమస్యలను పెంచుతోంది. ఇదంతా కాదు.. ఒకేసారి ఎలక్షన్ జరిపేస్తే.. ఇక ఐదేళ్ల దాకా ఆ జోలికి వెళ్లే పరిస్థితి ఉండదు. పాలన సాఫీగా చేసుకోవచ్చు అన్న ఆలోచనతో కేంద్రం ఉంది. ఇప్పటికే జమిలి బిల్లును గతేడాది డిసెంబర్ లో లోక్ సభ ముందుకు తీసుకొచ్చింది. మరింత సంప్రదింపుల కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ఈ జేపీసీకి పీపీ చౌదరి చీఫ్ గా ఉన్నారు. ఇటీవలే ఆయన కొన్ని విషయాలు షేర్ చేయడంతో జమిలి టైం దగ్గరపడిందన్న విషయాలు బయటికొచ్చాయి. దీంతో పొలిటికల్ సర్కిల్స్ లో ఉత్కంఠ పెరుగుతోంది.

ఎప్పుడూ ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు

స్వాతంత్ర్యం వచ్చాక అటు లోక్ సభకు, ఇటు రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అయితే ప్రభుత్వాలు కూలిపోవడం, రద్దవడం వంటి చర్యలతో మొత్తం ప్రాసెస్ మారిపోయింది. ఏదో ఒక ఏడాది.. ఏదో ఒక రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు చాలా కామన్ అయ్యాయి. దీంతో ఎప్పుడు చూసినా భారత్ లో ఎన్నికల వాతావరణమే కనిపిస్తోంది. ఇది టిపికల్ గా మారిపోయిందన్న వాదనలు పెరిగాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి జమిలి ఎన్నికలను తెరపైకి తీసుకొచ్చింది. మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసింది. ఆ కమిటి అన్ని రాష్ట్రాల్లో పర్యటించి రాష్ట్రపతికి రిపోర్ట్ కూడా సమర్పించింది. కాబట్టి ఇదంతా ముగిసిన చరిత్ర. మరి వాట్ నెక్ట్స్?

2034లో జమిలికి ముహూర్తమన్న జేపీసీ ఛైర్మన్

2034లో జమిలి ఎన్నికలకు దాదాపుగా ముహూర్తం ఖరారైనట్లే అని జేపీసీ ఛైర్మన్ పీపీ చౌదరి అంటున్నారు. ఈలోపు పరిష్కరించాల్సిన సమస్యలు, రాజ్యాంగ సవరణలు, రాష్ట్రపతి నోటిఫై చేయడం, రాజకీయ నిర్ణయాలు, లాజిస్టికల్ ఇష్యూస్ ఇవన్నీ ఉన్నాయి. మరోవైపు రాష్ట్రాల్లో సంప్రదింపులు కూడా జరగాల్సి ఉంది. ఇప్పటికే కోవింద్ కమిటీ సంప్రదింపులు చేసి రిపోర్ట్ ఇచ్చినా.. జేపీసీ ఆధ్వర్యంలో మరోసారి సంప్రదింపులు జరుగుతున్నాయి. నిజానికి 2034కి ముందు జమిలి ప్రణాళిక అమలు చేయాలనుకున్నారు. అయితే చాలా సవాళు దాటాల్సి ఉండడంతో 2034కి షిఫ్ట్ అయింది.

ఆర్టికల్ 82%ూ% ని కలపాలన్న ప్రతిపాదన

పైగా ఈ జమిలి బిల్లు ఇంకా మార్పులు చేర్పుల దశలో ఉంది. అంతే కాదు.. ఈబిల్లులో పేర్కొన్న విషయం ప్రకారం చూస్తే రాజ్యాంగంలో ఆర్టికల్ 82%ూ% ని కలపాలన్న ప్రతిపాదన ఉంది. కొత్తగా ఎన్నికైన లోక్‌సభ తొలి సమావేశం సందర్భంగా రాష్ట్రపతి అపాయింటెడ్ డేట్ ప్రకటించడానికి ఈ ఆర్టికల్ అనుమతిస్తుంది. కానీ ప్రస్తుత లోక్‌సభ మొదటి సమావేశం 2024లో ప్రారంభమవడంతో 2029లోనే చేయవచ్చు.

రాష్ట్రపతి అపాయింటెడ్ డేట్ ప్రకటించడం కీలకం

అపాయింటెడ్ డేట్ రాష్ట్రపతి నోటిఫికేషన్ చేసిన తర్వాత, ఆ తర్వాత ఎన్నికైన రాష్ట్ర శాసనసభల పదవీకాలం 2029లో ప్రారంభమయ్యే లోక్‌సభ ఐదేళ్ల పదవీకాలానికి తగ్గట్లుగా మారుస్తారు. దీనర్థం ఏంటంటే.. అపాయింటెడ్ తేదీ తర్వాత ఎన్నికైన ఏ రాష్ట్ర అసెంబ్లీ అయినా దాని పదవీకాలం 2031 లేదా 2033లో ప్రారంభమైనా 2034 నాటికి ముగియాల్సిందే. సో ఈ మొత్తం ఎపిసోడ్ లో రాష్ట్రపతికి తదుపరి నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం 2029 లోక్‌సభ ఎన్నికల తర్వాతే వస్తుంది. అప్పటికి బిల్లు ఆమోదం పొందితే నెక్ట్స్ లోక్‌సభ 2034 వరకు కొనసాగుతుంది.

50 శాతం రాష్ట్రాల అసెంబ్లీల ఆమోదం అవసరం

అప్పుడే జమిలికి ఛాన్స్ ఉంది. అయితే ఈ వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లు చట్టంగా మారాలంటే పార్లమెంట్ ఉభయ సభలు మూడింట రెండు వంతుల మెజారిటీతో ఆమోదించాలి. అంతటితో మ్యాటర్ ఆగదు. చట్టం అయిన తర్వాత కనీసం 50 శాతం రాష్ట్రాల అసెంబ్లీల కూడా దీన్ని ఆమోదించాలి. అయితే ఈ విషయంలో ఎన్డీఏ ఎక్కువ రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. ఆ పని సులువు అవుతుంది. 20 రాష్ట్రాల్లో NDA పార్టీలు అధికారంలో ఉంటే INDIA బ్లాక్ 10 చోట్ల అధికారంలో ఉంది.

లోక్‌సభలో 364 సీట్లు, రాజ్యసభలో 164 సీట్లు కావాలి

ప్రస్తుతం NDAకి లోక్‌సభలో 292 సీట్లు, రాజ్యసభలో 129 సీట్లు ఉన్నప్పటికీ బిల్లును ఆమోదించడానికి అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లేదు. లోక్‌సభలో 364 సీట్లు, అలాగే రాజ్యసభలో 164 సీట్లు అవసరం. కానీ ఇప్పుడు ఎన్డీఏకు ఆ బలం లేదు. దీంతో నరేంద్ర మోడీ ప్రభుత్వానికి ఇండియా కూటమి పార్టీలు, అలాగే తటస్థ పార్టీల మద్దతు అవసరం. మరి అవి ఎంత వరకు సపోర్ట్ ఇస్తాయన్నది కీలకంగా మారుతోంది. జాతీయ ప్రయోజనాల గురించి ఆలోచించే పార్టీలు బిల్లుకు మద్దతు ఇస్తాయని ఎన్డీఏ నేతలు లెక్కలు వేసుకుంటున్నారు.

చిన్న పార్టీలకు జమిలితో నష్టం జరగబోతోందా?

వన్ నేషన్, వన్ ఎలక్షన్ వస్తే ఏయే రాష్ట్రాల్లో అసెంబ్లీల పదవీకాలం కటాఫ్ అవుతుంది? జమిలి ఎన్నికలు నిర్వహించడంలో సవాళ్లేమిటి? ఎలక్షన్ కమిషన్ ముందున్న ఆప్షన్లు ఏంటి? 2029 నాటికి మద్దతు సరిపోతుందా? కలిసి వచ్చే పార్టీలేంటి.. దూరంగా జరగాలనుకుంటున్న పార్టీలేవి? చిన్న పార్టీలకు జమిలితో నష్టం జరగబోతోందా? రాష్ట్రాలకు, లోక్ సభకు ఒకేసారి ఓటు వేయాలనుకున్నప్పుడు జనం ఆలోచన ఎలా ఉండబోతోంది?

2027లో ఎన్నికలు జరిగితే 2032లో టెన్యూర్ ముగింపు

లోక్ సభతో పాటే ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకు ఈ జమిలితో పదవీకాలానికి వచ్చిన ఇబ్బంది ఏమీ లేదు. కానీ వెనకా ముందు ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లోనే పరిస్థితి మారబోతోంది. అంటే 2026, 2027, 2028లో జరిగే రాష్ట్రాల అసెంబ్లీలు ఐదేళ్లు ప్రశాంతంగానే ఉంటుంది. ఆ తర్వాతే కథ మారుతుంది. అంటే 2027లో అసెంబ్లీ ఎన్నికలు జరిగితే.. ఆ టెన్యూర్ 2032లో ముగుస్తుంది. అంటే 2034లో జమిలి వస్తే.. రెండేళ్లకే పదవీకాలం ముగిసిపోతుంది. అంటే 2032లో ఎలక్షన్ జరిగితే 2034లో డిజాల్వ్ కావాల్సిందే అన్న మాట. సో అక్కడ కొంచెం ఇబ్బందికర పరిస్థితులు ఉంటాయి. ఇక 2033లో రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించాల్సి వస్తే అప్పుడు ఏం చేస్తారన్నది ఇంట్రెస్టింగ్ గా మారుతోంది. ఆపద్ధర్మ సీఎంగా ప్రకటించి ఏడాది కొనసాగిస్తారా.. లేదంటే రాష్ట్రపతి పాలన విధిస్తారా అన్నది కీలకంగా మారింది. ఎందుకంటే ఏడాది వ్యవధిలోనే రెండుసార్లు ఎన్నికలు అంటే ఖర్చు భారమే. ఓటర్లకు కూడా ఇబ్బందికరమే.

యూపీ, పంజాబ్, మణిపూర్, గోవా ఎన్నికలు

2027లో గుజరాత్, హిమాచల్, ఉత్తరాఖండ్, యూపీ, పంజాబ్, మణిపూర్, గోవాలో ఎన్నికలు ఉన్నాయి. వీటి టెన్యూర్ 2032లో ముగుస్తుంది. అంటే రెండేళ్ల కోసం మళ్లీ ఇక్కడ ఎలక్షన్ జరపాల్సి ఉంటుంది. ఇక 2028లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్, తెలంగాణ, మిజోరాంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. 2033 వరకు టెన్యూర్ ఉంటుంది. ఆ తర్వాత ఈ అసెంబ్లీ పదవీకాలాన్ని ఏడాది పాటు అంటే 2034లో జరగబోయే జమిలి ఎన్నికల వరకు పొడగించే అవకాశం ఉంటుంది. ఆపద్ధర్మ ప్రభుత్వాన్ని కంటిన్యూ చేసే ఛాన్స్ ఉంది. అసోం, కేరళ, తమిళనాడు, బెంగాల్ కు మూడేళ్ల పదవీకాలం దొరకనుంది. సో రాష్ట్రాల్లో పరిస్థితులు పూర్తిగా మారుతాయి.

ఈవీఎంలు పెంచుకోవాల్సిన అవసరం

పార్లమెంటులో బిల్లును ఆమోదించడానికి విస్తృతమైన చర్చ అవసరం. రాజ్యాంగం, చట్టాలు, రూల్స్ అన్నీ ఓకే అయ్యాక అప్పుడు మరో సవాల్ మొదలువుతుంది. లాజిస్టిక్, ఆర్థిక సవాళ్లు ఎదురవుతాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల సంఖ్యను రెట్టింపు చేసుకోవాలి. అలాగే ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడానికి మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేయాలి. ఒకేసారి ఎన్నికలు జరిగితే కొత్త %జుఎవీ%ల కోసం ప్రతి 15 సంవత్సరాలకు 10 వేల కోట్లు అవసరమని ECI అంచనా వేసింది. జమిలి పోలింగ్ కోసం చాలా మ్యాన్ పవర్ అవసరం. ఎన్నికల ఫలితాలు ఆలస్యమయ్యే ఛాన్స్ ఉందన్న వాదన ఉంది. చిన్న చిన్న ఎలక్షన్లకే హింస కట్టడి చేయలేని పరిస్థితులు కొన్ని రాష్ట్రాలు, ప్రాంతాల్లో ఉంటున్నాయి.

ఒకే పార్టీ ఆధిపత్యానికి దారితీస్తుందన్న భయాలు

అయితే వన్ నేషన్ వన్ ఎలక్షన్ ప్రతిపాదనను చాలా పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ముఖ్యంగా ఇండియా కూటమిలోని పార్టీలు వద్దేవద్దంటున్నాయి. జమిలి బిల్లు రాజ్యాంగ విరుద్ధమంటోంది కాంగ్రెస్. ఈ ప్రతిపాదన దేశంలో ఒకే రాజకీయ పార్టీ ఆధిపత్యానికి దారితీస్తుందని, రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని బలహీనపరుస్తుందని కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ప్రతిపాదన రాష్ట్రాల స్వయంప్రతిపత్తి, అలాగే ప్రాంతీయ సమస్యలు నిర్లక్ష్యానికి గురవుతాయని సమాజ్ వాదీ పార్టీ అంటోంది. అటు తృణమూల్ కాంగ్రెస్ కూడా జమిలి ఎన్నికలకు వ్యతిరేకమే అన్నది.

రాష్ట్ర సమస్యలను డామినేట్ చేస్తాయన్న చర్చ

ఇది ప్రాంతీయ పార్టీలకు నష్టం కలిగిస్తుందని, జాతీయ సమస్యలు రాష్ట్ర స్థాయి సమస్యలన డామినేట్ చేస్తాయని వాదిస్తోంది. ఈ ప్రతిపాదన సమాఖ్య వ్యవస్థను బలహీనపరుస్తుందనుకుంటున్నారు. డీఎంకే కూడా జమిలి బిల్లును వ్యతిరేకించింది. ఇది రాష్ట్రాల హక్కులను కాలరాస్తుందని, ప్రాంతీయ పార్టీలకు ప్రతికూలంగా ఉంటుందని వాదిస్తోంది. జాతీయ పార్టీలు ఆధిపత్యం చెలాయించే అవకాశం ఉంటుందన్న ఆందోళన డీఎంకేలో ఉంది. శివసేన ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే UBT పార్టీ, ఆర్జేడీ కూడా వ్యతిరేకంగా ఉన్నాయి.

ప్రజాధనం ఆదా, ప్రభుత్వ ఖజానాకు మేలన్న కేంద్రం

అయితే కేంద్ర ప్రభుత్వం మాత్రం ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే ప్రజాధనం ఆదా అవుతుందని, ప్రభుత్వ ఖజానాకు మేలు జరుగుతుందంటున్నారు. మాటిమాటికి ఓట్లు వేయాల్సిన పని జనానికి తప్పుతుందంటున్నారు. అలాగే ప్రజలు, ప్రభుత్వం, అధికారుల సమయం ఆదా అవుతుందని చెబుతున్నారు. ఒక్కసారి ఎన్నికలు జరిగి ప్రజామోదంతో ప్రభుత్వం ఏర్పాటు చేసే వారు. పాలసీ మేకింగ్ పై పూర్తిస్థాయి ఫోకస్ పెట్టేందుకు ఛాన్స్ ఉంటుందంటున్నారు. మాటిమాటికీ వచ్చే ఎన్నికల కోడ్ తో అభివృద్ధి పనులకు బ్రేక్ పడకుండా ఉంటుందంటున్నారు. అంతే కాదు.. ఒకేసారి ఎంపీ, ఎమ్మెల్యే, స్థానిక సంస్థలకు ఓటు వేయడం అంటే.. జనం కూడా ఆసక్తిగా పోలింగ్ కేంద్రాలకు వస్తారని దీంతో ఓట్ల శాతం పెరుగుతుందన్న లాజిక్స్ వినిపిస్తున్నారు.

ఒకేసారి పోలింగ్ అంటే జనంలో ఆసక్తి

ఇక వేర్వేరుగా జరిగే పోలింగ్ తో బ్లాక్ మనీ పెరుగుతుందని, జమిలితో ఆ నల్లధనం ప్రవాహానికి చెక్ పడుతుందంటున్నారు. తక్కువ గ్యాప్ లో ఎన్నికలు జరుగుతుంటే.. దీర్ఘకాల లక్ష్యాలపై ప్రభుత్వాలు పని చేయవని, ఓటర్లను ఆకట్టుకునే తక్కువ ప్రయోజనాలు కల్పించే పనులు చేసేందుకే మొగ్గుచూపుతాయన్న వాదనను ఇంకొందరు వినిపిస్తున్నారు. కేంద్రపాలిత ప్రాంతాల బిల్లుకు ఉభయ సభల్లో సాధారణ మెజారిటీ అవసరం కాగా, రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే లోక్‌సభ అలాగే రాజ్యసభ రెండింటిలోనూ మూడింట రెండొంతుల మంది సభ్యుల మద్దతు అవసరం.

జమిలితో జవాబుదారీతనం తగ్గుతుందన్న వాదన

సో ఓవరాల్ గా చూస్తే..చిన్న, ప్రాంతీయ పార్టీలు..జాతీయ పార్టీలతో పోటీ పడలేవని దీనివల్ల వాటి రాజకీయ ప్రాతినిధ్యం తగ్గే అవకాశం ఉందంటున్నారు. ఎన్నికలు తరచూ జరగడం వల్ల ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీగా ఉంటాయని, కానీ జమిలి ఎన్నికల వల్ల ఈ జవాబుదారీతనం తగ్గుతుందని ప్రతిపక్ష పార్టీలు వాదిస్తున్నాయి.ప్రభుత్వాలు నడిపే పార్టీలకు భయం లేకుండా పోతుందంటున్నాయి. సో జమిలి బిల్లుపై ఏర్పాటైన జేపీసీ ఛైర్మన్ పీపీ చౌదరి నేతృత్వంలోని 39 మంది సభ్యుల ప్యానెల్ రాబోయే రెండున్నరేళ్లలో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వెళ్లి మరింతగా సంప్రదింపులు పూర్తి చేయబోతోంది. అంటే జమిలికి వ్యతిరేకంగా ఉన్న పార్టీలను ఒప్పించే లక్ష్యంతో ఉన్నారు.

# ట్రంప్ తీరుతో అమెరికాలో అలజడి

వాషింగ్టన్,ఎన్నికలకు ముందే వలస కార్మికులను పంపివేస్తానని ట్రంప్ వాగ్దానం చేశాడు. ఆ మేరకు ఇప్పుడు లాస్ ఏంజెల్స్ నగరంలో చిచ్చు పెట్టాడు. సైన్యాన్ని వెనక్కు తీసుకోవాలని కాలిఫోర్నియా రాష్ట్ర గవర్నర్ గవిన్ న్యూసమ్ డిమాండ్ చేశాడు, ట్రంప్ చర్య రాష్ట్ర సార్వభౌమత్వాన్ని హరించటమే అన్నాడు. శాంతి భద్రతలకు విఘాతం కలగాలని వాంఛిస్తున్న ట్రంప్‌కు అలాంటి అవకాశం ఇవ్వవద్దని పౌరులను కోరాడు. నగర మేయర్ కరేన్ బాస్ కూడా గవర్నర్‌ను సమర్ధిస్తూ ట్రంప్ చర్య అశాంతిని రెచ్చగొట్టినట్లు ఆమె వ్యాఖ్యానించారు. నగర కౌన్సిల్లోని 15 మంది సభ్యులు కూడా మిలిటరీ చర్యను ఖండించారు. వారి వైఫల్యం కారణంగానే తాను మిలిటరీని పంపినట్లు ట్రంప్ సమర్ధించుకున్నాడు.అమెరికన్ కమ్యూనిటీ సర్వే ప్రకారం వలస వచ్చిన వారు ఫెడరల్ ప్రభుత్వానికి 2022లో 383 బిలియన్ డాలర్లు, రాష్ట్ర, స్థానిక సంస్థలకు 196 బిలియన్ డాలర్లు రాబడి చేకూర్చారు. నమోదు కాని కార్మికులు, ఆదాయ, సామాజిక భద్రత పన్నులే మొత్తం వంద బిలియన్ డాలర్లకు పైగా ఉన్నాయి. చిత్రం ఏమిటంటే నిరుద్యోగ, ఆరోగ్య బీమా వారికి వర్తించకపోయినా పన్ను చెల్లించారు. 2033 నాటికి మరో 5.2 శాతం వలస కార్మికులు పెరుగుతారని వారి వలన ఏడు లక్షల కోట్ల డాలర్ల మేర తోడవుతుందని, జిడిపి 8.7 లక్షల కోట్ల డాలర్లు పెరగటంతో పాటు ఫెడరల్ ప్రభుత్వానికి 1.2 లక్షల కోట్ల పన్ను ఆదాయం పెరిగి, 900 బిలియన్ డాలర్ల లోటు తగ్గుతుందని అంచనాలు వెలువడ్డాయి. అంటే తమకు ఎలాంటి హక్కులు లేకున్నా పన్నులు మాత్రం చెల్లిస్తున్నారు. వెట్టిచాకిరీ చేస్తున్నారు. అలాంటివారు అమెరికాలో భాగంగా అక్కడి ప్రజలు ఆమోదించారు. కానీ ట్రంప్ ఆలోచనలు చర్యలు వేరుగా ఉన్నాయి. విదేశీ చొరబాటుదార్లు, నేరగాళ్లు ఆక్రమించినట్లుగా ట్రంప్ ప్రచారం చేసుకుంటున్నాడు. రికార్డుల్లో నమోదు కాని వారితో సహా విదేశాల్లో జన్మించిన కార్మికులు 18.6 శాతం (2.91 కోట్ల మంది) అని 2023 కార్మిక శాఖ వివరాలు తెలిపాయి.అంతకు ముందు ఏడాది 18.1 శాతం ఉన్నారు. వీరిలో 47.6 శాతం మంది మెక్సికో, ఇతర లాటిన్ అమెరికా దేశాల నుంచి వచ్చిన వారు కాగా 25.1 శాతం ఆసియా ఖండం నుంచి ఉన్నారు. అధికారికంగా నమోదు కాని వారు 83 లక్షల మంది ఉన్నట్లు, వారిలో మెక్సికో నుంచి 30 శాతం, మధ్య, దక్షిణ అమెరికా దేశాల నుంచి 20, ఆసియా నుంచి 15 శాతం ఉన్నట్లు న్యూయార్క్ వలస అధ్యయన కేంద్రం అంచనా వేసింది. జనాభాలో



వలస వచ్చిన వారు 13.8 శాతం, వీరిలో కొందరు వాణిజ్యాలను కూడా ప్రారంభించారు, వారి ద్వారా 2022 ఒక్క ఏడాదే 110 బిలియన్ డాలర్ల రాబడి వచ్చిందని లెక్కలు చెబుతున్నాయి. వీరందరినీ పంపించివేయాలంటే ఏడాదికి 500 బిలియన్ డాలర్లు ఖర్చు అవుతాయని, రానున్న పది సంవత్సరాలలో కార్మికుల కొరత ఏర్పడుతుందని, జిడిపి 5.1 లక్షల కోట్ల డాలర్లు తగ్గుతుందని తెలుసు. వలసదారులను బహిష్కరిస్తామని ట్రంప్ వాగ్దానం చేశాడు. మిలిటరీని దించటాన్ని డెమోక్రటిక్ పార్టీకి చెందిన 22 రాష్ట్రాల గవర్నర్లు ఒక ప్రకటనలో ఖండించారు. ట్రంప్ అధికార దుర్వినియోగం, దుర్మార్గమైన, విభజించే చర్య అన్నారు. మెక్సికన్లు లాస్ ఏంజెల్స్ నగరంలో నివశించటాన్ని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షెయిన్‌బామ్ సమర్ధించారు. వారు మంచి వారు, నిజాయితీ పరులు, నేరస్తులు కాదు, తమ కుటుంబాలకు తోడుగా ఉండేందుకు, మెరుగైన జీవితం కోసం వారంతట వారే వెళ్లారని ఆమె అన్నారు. నిరసనకారులు అమెరికా పతాకాలతో పాటు మెక్సికో జాతీయ జెండాలను కూడా ప్రదర్శించారు. వాటిని చూపుతూ చూడండి విదేశీయులు మన దేశాన్ని ఎలా ఆక్రమించుకున్నారో వారిని బయటికి పంపవద్దా అంటూ రెచ్చగొడుతున్నారు. తాము అమెరికాకు వలస వచ్చామని, ఇక్కడే పిల్లలను కని పౌరులమయ్యామని, తమ వారసత్వానికి చిహ్నంగా మెక్సికో పతాకాలను ప్రదర్శిస్తూ దమనకాండకు నిరసన తెలుపుతున్నట్లు- ప్రదర్శకులు సమర్ధించుకుంటున్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్నవారిని రెచ్చగొట్టేందుకు ముసుగులు ధరించిన రహస్య పోలీసులను వినియోగించి

# దర్యాప్తులో కీలకం కానున్న డేటా

అహ్మదాబాద్,అహ్మదాబాద్‌లో ఘోర ప్రమాదానికి గురైన ఎయిరిండియా విమానానికి సంబంధించి అత్యంత కీలకమైన బ్లాక్ బాక్స్ లభ్యమైంది. భవన శిథిలాల నుంచి దీన్ని స్వాధీనం చేసుకున్నట్లు- ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో వెల్లడించింది. ప్రమాద ఘటనపై ముమ్మర దర్యాప్తు జరుగుతోందని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన 40 మంది సిబ్బంది పౌరవిమానయాన శాఖ బృందాలతో కలిసి పనిచేస్తున్నట్లు- తెలిపింది. అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా విమానం గురువారం ఘోర ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో మొత్తం 265 మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే, ఈ ప్రమాదానికి గల కారణాలు ఇప్పటివరకు తెలియలేదు. విమానంలో కీలకంగా ఉండే బ్లాక్ బాక్స్‌లోని సమాచారాన్ని విశ్లేషిస్తే ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను తెలుసుకునే వీలు కలుగుతుంది. ప్రతి కమర్షియల్ విమానంలో రెండు బాక్స్‌లు ఉంటాయి. అందులో ఒకటి ఫ్లైట్ డేటాను రికార్డ్ చేయగా.. మరొకటి కాక్‌పిట్ వాయిస్ రికార్డుకు ఉపయోగపడుతుంది. విమానాలకు ఏదైనా ముప్పు వాటిల్లినప్పుడు, అత్యవసర పరిస్థితిని తెలియజేస్తూ 'మేడే' అంటూ సమీపంలోని ఏటీసీకి పైలట్ ఓ సందేశాన్ని పంపుతారు. వీటితోపాటు పైలట్-కోపైలట్‌ల సంభాషణలన్నీ డీఎఫ్‌డీఆర్‌లో రికార్డవుతాయి. ఈ డీఎఫ్‌డీఆర్‌నే బ్లాక్‌బాక్స్‌గా వ్యవహరిస్తారని ఏఏఐబీ తెలిపింది.

# టాటా గ్రూప్ చరిత్రలో ఇదో చీకటి రోజు

అహ్మదాబాద్,టాటా గ్రూప్ చరిత్రలో ఇది అత్యంత అంధకారమైన రోజుల్లో ఒకటని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా క్రాష్ గురించి మరోసారి స్పందించారు. శుక్రవారం ఉద్యోగులకు పంపిన భావోద్వేగమైన లేఖలో, చంద్రశేఖరన్ తన బాధను వ్యక్తం చేశారు. ఈ ఘటనపై తాము షాక్‌లో ఉన్నామని, ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. దీంతోపాటు- ఈ ఘటనపై తాము పూర్తి పారదర్శకంగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం మాటలతో సాంత్వన ఇవ్వలేము. కానీ ఈ ప్రమాదంలో మరణించిన, గాయపడిన వారి కుటుంబాలకు అండగా ఉంటామని లేఖలో పేర్కొన్నారు. ఎక్కడ తప్పు జరిగిందో అర్థం చేసుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని చంద్రశేఖరన్ తన సందేశంలో చెప్పారు. భారతదేశం, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్ నుంచి విచారణా బృందాలు అహ్మదాబాద్‌కు చేరుకున్నాయన్నారు. ఈ క్రమంలో టాటా గ్రూప్ పూర్తి సహకారం వారికి అందిస్తుందని ఆయన వెల్లడించారు.

# మీ లెక్కలు తేలుస్తా.. వైసీపీ నేతలకు లోకేశ్ వార్నింగ్



అమరావతి,తల్లికి వందనం పథకంలో రూ.2 వేలు కోత విధించడంపై వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలుపై ఏపీ విద్యాశాఖ మంత్రి, యువనేత నారా లోకేశ్ ఘాటుగా స్పందించారు. తనపై అసత్య ఆరోపణలు చేస్తున్న వైసీపీ నేతలకు టైము ఇస్తున్నానని, 24 గంటల్లో వారు చేసిన ఆరోపణలు నిరూపించకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. లోకేశ్ మాస్ వార్నింగుతో మళ్లీ వైసీపీ నేతల అరెస్టులు ఉంటాయా? లేక కోర్టులో వారికి వ్యతిరేకంగా పిటిషన్ వేసి న్యాయబద్ధంగా చర్యలు తీసుకుంటారా? అన్న చర్చ జరుగుతోంది.తల్లికి వందనం పథకంలో మినహాయించిన రూ.2 వేలు పాఠశాలల అభివృద్ధి కోసం పాఠశాల నిధికి ప్రభుత్వం జమ చేస్తున్నట్లు ప్రకటించింది. అయితే ఆ రూ.2 వేలు మంత్రి లోకేశ్ సొంత ఖాతాకు వెళుతున్నట్లు వైసీపీ నేతలు ఆరోపణలు చేస్తున్నారని లోకేశ్ దృష్టికి వచ్చిందని చెబుతున్నారు. దీనిపై స్పందించిన మంత్రి లోకేశ్ తనపై ఆరోపణలను 24 గంటల్లో నిరూపించాలని వైసీపీ నేతలకు సవాల్ విసిరారు. ఆ నగదు తన ఖాతాలోకి వచ్చినట్లు చూపించకపోతే సిరయస్ యాక్షన్ ఉంటుందని హెచ్చిరిం చారు. నింద వేసి పారిపోతే ఊరుకోబోమని చెప్పిన లోకేశ్... ఆరోపణలను నిరూపించలేని పక్షంలో తీవ్ర పరిణామాలకు సిద్ధంగా ఉండాలని వైసీపీ నేతలకు సూచించారు.వైసీపీ నేతలకు వ్యతిరేకంగా చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. సూపర్ సిక్స్ హామీల్లో కీలకమైన తల్లికి వందనం పథకంలో 67,27,164 మంది విద్యార్థులకు రూ.8,745 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. దీనిపై అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ముందుగా ప్రతి విద్యార్థికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని చెప్పిన ప్రభుత్వం అందులో రూ.2 వేలు తగ్గించడాన్ని ప్రతిపక్ష వైసీపీ తప్పుపడుతోంది. అయితే తగ్గించిన రూ.2 వేలు మంత్రి నారా లోకేశ్ సొంత ఖాతాకు జమ అయ్యాయని వైసీపీ చేసిన విమర్శలు వివాదాస్పదమయ్యాయి.తనపై చేసిన ఆరోపణలను రుజువు చేయాలని మంత్రి సవాల్ చేయడంతో రాజకీయం ఆసక్తికరంగా మారింది. మంత్రి సవాల్ ను వైసీపీ స్వీకరిస్తుందా? లేదా? అనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే మంత్రి నారా లోకేశ్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని, తమ నేతలను అరెస్టు చేయిస్తున్నారని వైసీపీ చెబుతోంది. ఈ పరిణామాల్లో మళ్లీ లోకేశ్ పై విమర్శలు చేయడంతో మిస్ ఫైర్ అయ్యారా? అనే ప్రశ్న తలెత్తుతోందని అంటున్నారు. రాజకీయంగా ఏ విమర్శ అయినా చేయొచ్చని, కానీ ఆధారాలు లేని విమర్శలు వల్ల రాజకీయంగా నష్టమే ఎక్కువ జరుగుతుందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా మంత్రి లోకేశ్ తన ప్రత్యర్థులపై కోర్టుల్లో కేసులు వేశారు. ఇప్పుడు అధికారంలో ఉండగా, ప్రత్యర్థులను అంత తేలిగ్గా విడిచిపెడతారా? అన్నది కూడా ఉత్కంఠకు గురిచేస్తోంది. ఈ ఎపిసోడ్ ను వైసీపీ ఎలా టర్న్ చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

### 9 ఏళ్ల క్రితం కేసు కొట్టేయండి..20కి వాయిదా వేసిన హైకోర్టు

హైదరాబాద్,తొమ్మిదేళ్ల క్రితం గచ్చిబౌలి పీఎస్‌లో నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. తొమ్మిదేళ్ల క్రితం గోపన్‌పల్లిలోని వివాదాస్పద భూమిలో ఉన్న సొసైటీ– గదిని జేసీబీతో కూల్చివేశారని, కులం పేరుతో దూషించారని రేవంత్‌రెడ్డితో పాటు– ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, లక్ష్మణ్‌పై పెద్ది రాజు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.

# ఇజ్రాయెల్ భీకర దాడుల్లో ఆరుగురు న్యూక్లియర్ సైంటిస్టులు మృతి



జెరూసలెం: పశ్చిమాసియా మరోసారి రగులుతోంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ భీకరంగా విరుచుపడింది. ఇరాన్ న్యూక్లియర్, మిలటరీ స్థావరాలపై శుక్రవారం జరిపిన దాడుల్లో ఆ దేశానికి చెందిన ఆరుగురు ప్రముఖ అణ్వస్త్ర శాస్త్రజ్ఞులు మరణించగా, పలువురు మిలటరీ సీనియర్ నేతలు గాయపడ్డారు. 'రైజింగ్ లయన్' పేరుతో ఇజ్రెయెల్ జరిపిన ఈదాడి ఇటీవల కాలంలో ఇరాన్ న్యూక్లియర్ ప్రోగ్రామ్‌పై జరిగిన అతిపెద్ద దాడిగా గుర్తించారు.

బహుళ లక్ష్యాలపై

ఇజ్రాయెల్ బలగాలు, మిలటరీ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ బలగాలు వరుస దాడులు జరిపారు. టెహ్రాన్‌లోని నాటాన్స్ యురేనియం ఎన్‌రిచ్‌మెంట్ కేంద్రంతో పాటు పలు మిలటరీ స్థావరాలపై ఈ దాడులు జరిగాయి. ఈ దాడులను ఇజ్రాయెల్ ప్రభుత్వం సమర్థించుకుంది. ఇరాన్ అణ్వస్త్రాలను సేకరించకుండా నిరోధించిందేకు ముందస్తు చర్యగా ఈ ఆపరేషన్ నిర్వహించినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది.

దాడుల్లో మరణించిన శాస్త్రవేత్తలు వీరే

ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో మరణించిన ఇరాన్ న్యూక్లియర్ సైంటిస్టుల్లో ఫోరోదూన్ అబ్బాసీ ఇరాన్ ఆటమిక్ ఎనర్జీ ఆర్గనేజేష్ మాజీ అధిపతిగా ఉన్నారు. పార్లమెంటు సభ్యుడు కూడా. మహమ్మద్ మెహదీ టెహ్రాంచి అనే సైంటింజ్స్ సైద్ధాంతిక భౌతక శాస్త్రవేత్త. షహీద్ బెహిస్థీ యూనివర్శిటీ కులపతిగా పనిచేశారు. అబ్దుల్‌హమీద్ జోల్ఫఘరి అనే శాస్త్రవేత్త న్యూక్లియర్ సైంటిస్ట్‌గా ఉన్నారు. సయూ సైయద్ ఫఖి న్యూక్లియర్ శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. మరో న్యూక్లియర్ మత్లాబి జడే. వీరంతా ఇరాన్ న్యూక్లియర్ ప్రోగ్రాం, బాలిస్టిక్ మిజైల్ కార్యకలాపాల్లో ప్రమేయం ఉన్నట్టుగా యూఎన్ భద్రతా మండలి తీర్మానం జాబితాలో ఉన్నారు.

# రేవంత్ రెడ్డికి మంత్రుల మద్దతు ఏది?

హైదరాబాద్, రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి.. ఆయన మంత్రివర్గంలో ఇప్పటి వరకు 12 మంది మంత్రులుగా ఉండగా, తాజాగా మరో ముగ్గురు చేరారు. దీంతో మంత్రుల సంఖ్య 15కు చేరింది. వీరంతా రేవంత్ రెడ్డి క్యాబినెట్ లోని వారే. కానీ ఏ ఒక్కరు కూడా కీలక సమయాల్లో ఆయనకు అండగా నిలుస్తున్న సందర్భాలు కనిపించడం లేదని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఇలాంటి వింత పరిస్థితి ఈ కాలంలో దాదాపు ఏ ముఖ్యమంత్రికీ ఎదురు కాలేదని చెబుతున్నారు. బీఆరెస్ అధికారంలో ఉన్నప్పుడు నాటి సీఎం కేసీఆర్‌పై మంత్రులు ఈగ వాలనివ్వలేదు. పొరుగు రాష్ట్రం ఆంధ్రాలో సీఎంగా జగన్ ఏలినప్పుడు టీడీపీ నేతలు ఏ చిన్నపాటి విమర్శ చేసినా దానిని వైసీపీ మంత్రులు రాద్ధాంతం చేసేవారు. ఆమోదయోగ్యం కాదు కానీ పద్ధతుల్లో వ్యక్తిగత దూషణలకు సైతం వెనుకాడలేదు. ఇప్పుడు టీడీపీ మంత్రులు కూడా అదేతీరుగా చంద్రబాబుపై ఈగ వాలనివ్వడం లేదు.వైసీపీ నేతలకు ఎక్కడికక్కడ గట్టిగా రిటార్టులిస్తున్నారు.

హుందా విమర్శలు పోయి.. తిట్లు శాపనార్థాలు

రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజం. అది హుందాగా సాగినంత కాలం ప్రజలు కూడా హర్షిస్తారు. కానీ.. కొన్నేండ్లుగా ఆ పరిస్థితి మారిపోయింది. విమర్శలు తిట్లుగా పరిణమిస్తున్నాయి. హద్దులు దాటి వ్యక్తిగత జీవితాలను టార్గెట్ చేస్తున్న దయనీయ దృశ్యాలు తెలుగు రాష్ట్రాల్లో కనిపిస్తున్నాయి. అయితే.. ఇక్కడ మాత్రం చిన్న తేడా కనిపిస్తున్నది. ఎవరూ ప్రత్యర్థి విమర్శలకు శృతిమించిన స్థాయిలో కౌంటర్లు ఇవ్వాల్సి అవసరంలేదు కానీ.. కనీసం వాటిని ఎదుర్కొనాల్సిన అవసరం మాత్రం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. తెలంగాణలో బీఆరెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టార్గెట్‌గా చేసే విమర్శలకు సొంత మంత్రులు, పార్టీలోని ముఖ్య నేతలు తగిన విధంగా స్పందించడం లేదనే అభిప్రాయాలను మాత్రం వారు వ్యక్తం చేస్తున్నారు. మంత్రులు రేవంత్‌కు అండగా లేరా? అనే అనుమానాలు వచ్చేలా పరిస్థితి ఉన్నదని చెబుతున్నారు. బీఆరెస్ నేతల తిట్ల దండకానికి ఒకరిద్దరు కిందిస్థాయి నేతలు మాత్రమే స్పందిస్తున్న పరిస్థితి కనిపిస్తున్నది.

కేసీఆర్‌ను విచారణకు పిలవడంతో బీఆరెస్ గుర్రు

కాళేశ్వరం ప్రాజెక్ట్ అక్రమాలు, అవినీతిపై విచారణకు ఏర్పాటు చేసిన జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్.. మాజీ సీఎం కేసీఆర్‌ను విచారణకు పిలిచింది. దీనిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి టీ హరీశ్ రావు ముఖ్యమంత్రిని టార్గెట్ చేసుకుని ఘాటు వ్యాఖ్యలు చేస్తున్నారు. కేసీఆర్ విచారణకు వచ్చిన రోజు ఒక అడుగు ముందుకు వేసి కేటీఆర్.. ముఖ్యమంత్రిని వ్యక్తిగతంగా దూషించి హద్దులు దాటారనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గౌరవ వాచకాలు ఎప్పుడో పోయాయి.. వాడు వీడు.. సన్నాసి, చిల్లరగాడు.. అంటూ కొత్త పదజాలాలు విమర్శలకు తోడవుతున్నాయి. నీకు కేసీఆర్‌ను విచారణకు పిలిచే దమ్ముందా? అంటూ నిలదీస్తున్న బీఆరెస్ నాయకులు.. కేసీఆర్‌ను విచారణకు పిలవడం అంటే.. తెలంగాణను అవమానించడమేననే తీరులో ప్రచారం చేసుకుంటున్నారు. కేసీఆర్ కుమార్తె కవిత ఏకంగా ఇందిరా పార్క్ వద్ద ధర్నాకు దిగితే.. బీఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ముఖ్యమంత్రిని



చిల్లరగాడు అని అభివర్ణించారు. తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. ఇవన్నీ మీడియాలో ప్రముఖంగా కూడా వచ్చాయి.

తీవ్ర విమర్శలకూ మంత్రుల కౌంటర్‌లు లేవు!

విచిత్రం ఏమిటంటే.. రేవంత్‌రెడ్డిని వ్యక్తిగతం టార్గెట్ చేసి బీఆరెస్ నేతలు చేస్తున్న విమర్శలకు సహచర మంత్రులు స్పందించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. అంతకు మించి అనుమానాలను రేకెత్తిస్తున్నది. వారి తీరుపై కాంగ్రెస్ పార్టీవర్గాలు సైతం విస్మయానికి గురవుతున్నాయి. నిజానికి రేవంత్‌రెడ్డి మీద కాంగ్రెస్ సీనియర్ నేతల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఆయన పార్టీ అధ్యక్షుడు అయిన సందర్భంలో నేరుగానే వ్యతిరేకించారు. కానీ.. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పుడు కూడా ఆయనపై విమర్శలకు తోటి నేతలు, సహచర మంత్రులు స్పందించకపోవడం విడ్డూరమేనని కాంగ్రెస్ వ్యవహారాలను నిశితంగా పరిశీలించే ఒక జర్నలిస్టు అన్నారు. రేవంత్ రెడ్డిని బీఆరెస్ పొట్టు పొట్టుగా అనరాని మాటలు అంటే తమకేమి సంబంధం.. ఆయనను తిడుతున్నారు.. ఆయనే వాటిని తిప్పికొడతారు.. అనే తీరులో కొందరు మంత్రులు ఉన్నట్టు కనిపిస్తున్నదని రాజకీయ పరిశీలకుడొకరు వ్యాఖ్యానించారు.

వ్యతిరేకత కొనసాగుతున్నదా?

పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి నియామకం సమయంలోనే ఆయన పట్ల వ్యతిరేకత బయటపడింది. తట్టుకొని ఒక్కడై అసెంబ్లీ ఎన్నికల్లో పోరాడిన రేవంత్.. బీఆరెస్‌పై వ్యతిరేకత అనేక కీలక అంశంతోపాటు అనేక విషయాలు కూడా కలిసి రావడంతో ముఖ్యమంత్రి అయ్యారు. ఆ సమయంలో కూడా మల్లు భట్టివిక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వంటి కాంగ్రెస్ పార్టీలోని సీనియర్ నాయకులు.. సీఎం సీటు కోసం పోటీ పడ్డారు. కానీ.. ముఖ్యమంత్రి పదవికి అధిష్ఠానం రేవంత్‌రెడ్డినే ఎంపిక చేసింది. ఇదే ధోరణి ఇప్పుడు కూడా కొనసాగుతున్నదా? అనే అనుమానాలను రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. అందులోనూ రేవంత్‌కు రాహుల్ అపాయింట్‌మెంట్లు లభించకపోవడం, దాన్నుంచి అధిష్ఠానంతో ఆయనకు చెడిందనే ప్రచారాలు తోడవడంతో మంత్రులు మరింత ఉదాశీన వైఖరిని అనుసరిస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధిష్ఠానమే లెక్కచేయని రేవంత్‌ను తాము రక్షించేది ఏంటన్న భావనలో ఉన్నారా? అని సందేహాలు వెలిబుచ్చుతున్నారు. ఇది రానురాను ఎటువంటి పరిణామాలకు దారి తీస్తుందోనే చర్చలు సాగుతున్నాయి.

# తప్పులు కప్పిపుచ్చుకునేందుకు బురదజల్లే యత్నం



మచిలీపట్టణం,చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు బురదజల్లే కార్యక్రమాలకు మాజీమంత్రి పేర్ని నాని పాల్పడుతున్నాడని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. ఎన్నికల్లో తన కొడుకుని గెలిపిచుకోవడం కోసం పడరానిపాట్లు పడి, చేయరాని తప్పులు చేశారని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి పేర్ని నాని నకిలీ పట్టాల వ్యవహారంపై మంత్రి కొల్లు రవీంద్ర షాకింగ్ కామెంట్స్ చేశారు. పేర్ని నానికి మతిభ్రమించిందని ఆరోపించారు. అరెస్ట్ భయంతో పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇలాంటి నేతలను ఎందరినో చరిత్రలో చూశామని.. అవాకులు చవాకులు పేలిన చాలమంది నేతలు కాలగర్భంలో కలిసిపోయారని ఆక్షేపించారు. దొంగ పట్టాలు సృష్టించి అమాయక పేద ప్రజలకు పంచి పెట్టి మోసం చేశారని మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. ఆనాడు తహసీల్దార్ కార్యాలయంలో అర్ధరాత్రి పూట దొంగ పట్టాలు తయారు చేయడాన్ని తాము రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని అన్నారు. స్ట్రీట్ ఫీల్డ్ పేరుతో పట్టాలు ఇచ్చి పేదలను మోసం చేశారని మండిపడ్డారు. నాడు పేర్ని నాని ఇచ్చిన దొంగ పట్టాలపై విచారణ జరుగుతుంటే గజ గజ వణికిపోతున్నాడని సెటైర్లు గుప్పించారు. తండ్రీ కొడుకులు ఇద్దరూ పారిపోయి హైకోర్టుకు వెళ్లి ముందస్తు బెయిల్ పిటీషన్లు వేశారని మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. ఎన్నికల కోడ్ వచ్చే వరకు తహసీల్దార్‌గా సునీల్ ఉన్నారని చెబుతున్నావ్.. ఎక్కడ ఉన్నారో చెప్పాలని మంత్రి కొల్లు రవీంద్ర సవాల్ విసిరారు. కోడ్ వచ్చిన సమయంలో సునీల్ అనపర్తిలో ఉన్నారని గుర్తుచేశారు. పేర్ని నానికి ఆయన భార్య మీద అంత ప్రేమ ఉంటే పేదల బియ్యం బొక్కేవారా అని ప్రశ్నల వర్షం కురిపించారు. పేర్ని నాని గోడౌన్ నుంచి కాకినాడ పోర్టుకు వెళ్లిన ప్రతి లారీ సీసీ ఫుటేజ్ టోల్ గేట్ల దగ్గర సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయని తెలిపారు. న్యాయాధికారి ఆదేశాలతోనే పేర్ని నాని భార్యను విచారించారని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ప్రెస్‌మీట్‌లు పెట్టి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్న పేర్ని నానిని చూసి రాష్ట్ర ప్రజలంతా ఒక బఫూన్‌లా చూస్తున్నారు. నీలాంటి వాళ్లు రాజకీయాల్లో అనర్హులు.. నీపై అనర్హత వేటు– వేయాలి. గతంలో 6400 టిడ్కో ఇళ్లు కడితే పేదలు ఇవ్వడానికి మీకెందుకు మనసు రాలేదు.. ఇళ్ల స్థలాల పేరుతో భూములు కొని కమిషన్లకు పాల్పడ్డాడు. గ్రామాల్లో స్మశానాలను సైతం కాజేశారు. మెడికల్ కాలేజ్ భూముల కొనుగోళ్లలో అవినీతి జరిగిందని కాగ్ మొట్టికాయలు వేయడం నిజం కాదా..? గిలకలదిండిలో సీఆర్జెడ్ భూములిస్తే పట్టాలు రావని ఆ నాడు మేము పోరాడం. కలెక్టర్‌ని నకిలీ పట్టాల విషయంలో కోర్టు మెట్లు– ఎక్కే పరిస్థితి తీసుకొచ్చావ్.. ఆ నాడు నేను పోరాట ఫలితంగానే నువ్వు అక్కడి పేదలకు భూములు కొని ఇచ్చారు.. ఆ భూముల కొనుగోళ్లలోనూ కమిషన్లు కొట్టు–కున్నారు. బందరుకోటలో గతంలో నువ్వు ఇచ్చిన దేవనబోయిన రాము భూములకు ఇప్పటికీ పట్టాలు రాని పరిస్థితి.. బందరు పోర్టును నేనే కట్టా.. నేనే కట్టా అంటు–న్నావ్..నాడు మేం చేసిన ఉద్యమ ఫలితమే బందర్ పోర్టు. 2006లో బందర్ పోర్టును రాజశేఖరరెడ్డి గోగులేరుకు తరలిస్తే నాకు అభ్యంతరం లేదని సంతకం పెట్టిన వ్యక్తివి నువ్వు.. ఆ తర్వాత మేం చేసిన ప్రజా ఉద్యమానికి దిగి వచ్చి మా అమ్మ మీద ఒట్టు–.. పెదపట్నంలోనే పోర్టు అన్న వ్యక్తివి కూడా నువ్వే.. 2014 ఎన్నికల్లో పోర్టు పనులు ప్రారంభించకపోతే కోనేరుసెంటర్‌లో మోకాళ్లపై నిలబడి ముక్కును నేలకు రాసి రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న వ్యక్తి నువ్వు కాదా' అని మంత్రి కొల్లు రవీంద్ర ప్రశ్నల వర్షం కురిపించారు. గత టీడీపీ ప్రభుత్వం 2014లో వచ్చిన తర్వాత ల్యాండ్ పూలింగ్, ల్యాండ్ పర్చేజింగ్, భూసేకరణ పాలసీల కింద భూములు సేకరించాం. భూముల సేకరణలో అనేక ఇబ్బందులు పెట్టావ్. రెండుసార్లు జగన్‌ని తీసుకొచ్చి భూములు ఇవ్వకుండా అడ్డుకునే ప్రయత్నం చేశావ్.. వీటన్నింటినీ అధిగమించి గత టీ–డీపీ ప్రభుత్వంలో పోర్టు పనులు ప్రారంభిస్తే 2019లో అధికారంలోకి వచ్చిన మీరు ఆ పనులు ఆపివేశారు. గతంలో బాలశౌరి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి కొంత నిధులు తెస్తే ఎన్నికల ముందు పోర్టు పనులు ప్రారంభించారు. నేడు ఆ పనులను 67శాతం మేం పూర్తి చేశాం. 2026 జూన్ తర్వాత పోర్టును ఆపరేషన్‌లోకి తీసుకువస్తాం. ప్రభుత్వ అధికారులను, ఉద్యోగులను బెదిరించాలని చూస్తే సహించేది లేదు. అధికారులపై అభియోగాలు మోపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మసులా బీచ్ ఫెస్టివల్ గురించి మాట్లాడే అర్హత నీకు లేదు.. మంగినపూడి బీచ్‌ను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు బీచ్ ఫెస్టివల్ నిర్వహించాం. మచిలీపట్నం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాం' అని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.

# మేనత్తతో కలిసి మద్యం తాగి.. ఆపై మట్టుబెట్టిన మేనల్లుడు!



వరంగల్ : మద్యానికి అలవాటు పడి, జల్సాలకు అవసమైన డబ్బు కోసం మేనత్తను అతిదారుణంగా హత్యచేసి, ఒంటి మీద నగలను చోరీ చేసిన మేనల్లుడిని వరంగల్ జిల్లా గీసుగొండ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నిందితుడి నుండి రూ.18లక్షల విలువగల సుమారు 170 గ్రాముల బంగారు, 34 గ్రాముల వెండి అభరణాలతో పాటు పదివేల రూపాయల నగదు, ద్విచక్రవాహనం, ఒక సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ నగరంలోని రాజీవ్‌కాలనీ, మట్టెవాడకు చెందిన నిందితుడు రేకులపెల్లి ప్రణయ్ ( 23). ఈ అరెస్టుకు సంబందించి ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్ కుమార్ వివరాలను వెల్లడించారు. ఈ నెల 7వ తారీఖున గీసుగొండ మండలం, స్థంబాలపల్లి గ్రామానికి చెందిన కొచన స్వరూప (70) అనే వృద్ధురాలిని గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేసినట్లు మృతురాలి కుమారుడు ఫిర్యాదు చేశాడు. దానిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేశారు.నిందితుడు రేకులపెల్లి ప్రణయ్ ప్రైవేట్ ఉద్యోగాన్ని చేస్తూ జల్సాలు చేసేవాడు. ఇతరుల వద్ద అప్పులు చేశాడు. ఇండ్లల్లో నాలుగు చోరీలకు పాల్పడ్డాడు. అయిన నిందితుడి అప్పులు తీరలేదు. ఈ క్రమంలో స్థంభంపల్లి గ్రామంలో ఒంటరిగా నివాసం వుంటున్న మేనత్తపై దృష్టి పడింది. సంఘటన జరిగిన రోజు సాయంత్రం మేనత్త ఇంటికి చేరుకున్నాడు. మేనత్తతో కలిసి మద్యం సేవించి ఇంటిలోనే నిద్రించాడు. ఆమె నిద్రపోతుండగా డంబెల్‌తో తలపై కొట్టడంతో ఆమె మరణించింది. మృతురాలి ఒంటిపై వున్న బంగారు అభరణాలు, ఇంటిలోని వెండి సామాను, కొంత డబ్బును దోచుకొని వెళ్ళాడు. అనంతరం నిందితుడు వరంగల్‌లోని తన ఇంటికి తిరిగి వచ్చి రక్తమరకలతో కూడిన బట్టలను విప్పి యం.జి.యం వెళ్ళి గాయమైన చేతికి చికిత్స చేయించుకున్నాడు. ఈ కేసులో దర్యాప్తు జరిపిన పోలీసులు.. నిందితుడిని అరెస్టు చేశారు.

# జేసీ పంతానికి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత!



అమరావతి,వైసీపీ హయాంలో రాక్షసపాలన సాగిందనేది చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్‌తో పాటు కూటమి నేతల ప్రధాన ఆరోపణ. గత వైసీపీ పాలనకు భిన్నంగా మంచి పాలన అందిస్తుందని కూటమికి ప్రజలు పట్టం కట్టారు. అయితే కూటమి చెప్పిందానికి, చేస్తున్నదానికి పోలికే లేదు. ఎందుకంటే, వైసీపీ పాలనే నయమని ఏపీ ప్రజానీకం అనుకుంటున్న పరిస్థితి.కూటమి కూడా రాక్షస పాలన సాగిస్తుందనేందుకు .. అనంతపురం జిల్లా తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని ఆయన నియోజకవర్గంలో అడుగు పెట్టనివ్వకపోవడమే. దాదాపు ఏడాదిగా తాడిపత్రిలో ఆయన్ను తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కాలు మోపనివ్వకపోవడం గమనార్హం. దీంతో కేతిరెడ్డి పెద్దారెడ్డి హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది.తాడిపత్రికి వెళ్లేందుకు కేతిరెడ్డికి రక్షణ కల్పించాలని ఏపీ హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల విషయమై అనంతపురం ఎస్పీ జగదీష్‌ను కలిసి కేతిరెడ్డితో పాటు ఇతర వైసీపీ నాయకులు వివరించారు. మహానాడు ఉందని, కొంతకాలం సమయం ఇవ్వాలని కేతిరెడ్డికి అనంతపురం ఎస్పీ చెప్పారు. మహానాడు ముగిసి రోజులు గడుస్తున్నాయి. దీంతో తాడిపత్రి వెళ్లడానికి ఇవాళ కేతిరెడ్డి సిద్ధమయ్యారు.కానీ ఇవాళ ఆయన్ను తాడిపత్రికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. శింగనమల నియోజకవర్గం యల్లనూరు మండలం తిమ్మంపల్లి గ్రామం నుంచి కదలకుండా కేతిరెడ్డిని పోలీసులు అడ్డుకోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. హైకోర్టు ఆదేశాలున్నాయని కేతిరెడ్డి నెత్తీనోరు కొట్టుకుని చెబుతున్నా, పోలీసులు ఏ మాత్రం వినిపించుకోనట్టు తెలుస్తోంది. ఈ పరిణామాల్ని ప్రజానీకం నెగెటివ్ కోణంలో చూడకుండా వుంటుందని పాలకులకే తెలియాలి.గతంలో న్యాయస్థానాలన్నా లెక్కలేదని వైఎస్ జగన్‌ను తీవ్రంగా విమర్శించిన ప్రస్తుత పాలకులే, నేడు అదే బాటలో నడుస్తుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇలాంటి అరాచక, అప్రజాస్వామిక విధానాలు అంతిమంగా ప్రభుత్వానికి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత తీసుకురావడం ఖాయం. అయితే జేసీ ప్రభాకర్‌రెడ్డి పంతం కోసం, ప్రభుత్వాన్ని పణంగా పెట్టడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

# మేఘాలయ బ్రాండ్ కు ముప్పుగా ఆమె దుర్మార్గం



న్యూఢిల్లీ,ఒకరి కాలిమవాంఛ ఒక రాష్ట్రానికి తలనొప్పిగా మారటమే కాదు.. ఇప్పటివరకు ఎలాంటి మచ్చ లేని తమపై పడ్డ మరకను తుడుచుకోవటానికి పడుతున్న పాట్లు అన్ని ఇన్ని కావు. అవును.. హనీమూన్ పేరుతో మేఘాలయకు తీసుకొచ్చి.. భర్తను కిరాయి హంతకులతో చంపించిన భార్య సోనమ్ ఉదంతం.. మేఘాలయ టూరింజకు పెద్ద తలనొప్పిగా మారింది. ప్రకృతి అందాలతో ఈశాన్య భారతం ఎంత బాగుంటుందో తెలిసిందే. అయితే.. ఈశాన్య రాష్ట్రాలకు వెళ్లే వారు తక్కువ. ఆయా రాష్ట్రాల ఆదాయ మార్గం టూరిజమే.అయితే.. సోనమ్ కిరాతకం కారణంగా మేఘాలయ సేఫ్ కాదా? అన్న సందేహాలు వ్యక్తమయ్యాయి. ఇప్పుడైతే భర్తను చంపేందుకు మధ్యప్రదేశ్ కు చెందిన సోనమ్ చేసిన ప్లానింగ్.. ఆమె కన్నింగ్ ప్రపంచానికి తెలిసింది. ఈ కేసు వెలుగు చూసిన వేళ.. మేఘాలయ టూరిజం బ్రాండ్ ను రఘువంశీ దారుణ హత్య దెబ్బ తీసింది. పర్యాటకులకు కొత్త సందేహాల్ని వ్యక్తమైన పరిస్థితి. ఈ విషయాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఈ కేసు విచారణను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టటమే కాదు.. అసలు వాస్తవాల్ని వెలుగు లోకి తీసుకొచ్చేందుకు విపరీతంగా శ్రమించింది.

Printed, Published & Owned by MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From SPOORTHI PUBLICATIONS, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: MEDE SHANTHI KUMAR.